
ఆంధ్రజ్యోతి

గరిష్ఠం 28.5
కనిష్ఠం 22.5

ANDHRAJYOTHY



యాదాద్రి భువనగిరి

5

మంగళవారం 23 సెప్టెంబరు 2025

ప్రాజెక్టుల నీటిమట్టం

ప్రాజెక్టు	పూర్తిస్థాయి	ప్రస్తుతం	ఇన్‌ఫ్లో	అవుట్‌ఫ్లో
	నీటి మట్టం (అడుగులు)		(క్యూసెక్కులు)	
సాగర్ (టీఎంసీలు)	590 (312.0450)	587.60 (305.50)	3,32,150	3,32,150
మూసీ (టీఎంసీలు)	645 (4.46)	643.70 (4.12)	65950.62	5651.42
పులిచింతల (టీఎంసీలు)	175 (45.77)	170.831 (39.5561)	2,89,300	3,14,300

చికెన్ ధరలు	లైవ్ : రూ.160	డ్రెస్ : రూ.220	స్కిన్‌లెస్ : రూ.255



రిజర్వేషన్లపై చక చకా ఏర్పాట్లు

స్థానిక సంస్థల ఎన్నికల సందడి జోరందుకుంది. ఎన్నికల నిర్వహణపై కొన్ని రోజులుగా నెలకొన్న సందిగ్ధతకు ప్రభుత్వం తెరదించనుంది. రిజర్వేషన్ స్థానాల కేటాయింపు పూర్తి చేయాలని ఉన్నతాధికారుల నుంచి ఆదివారం ఆదేశాలు జారీ అయ్యాయి. గ్రామపంచాయతీల్లో వార్డు సభ్యుల నుంచి సర్పంచ్, జడ్పీటీసీ, ఎంపీటీసీ సభ్యుల రిజర్వేషన్లు చేపట్టాలని ఆదేశాలు జారీచేసింది. అధికారులంతా సమీక్ష సమావేశాన్ని నిర్వహించుకుని రిజర్వేషన్లపై కసరత్తు మొదలు పెట్టాలని ప్రభుత్వం ఆదేశించింది.

- (ఆంధ్రజ్యోతి-యాదాద్రి)

- స్థానిక సంస్థల ఎన్నికలపై ప్రభుత్వం ముందడుగు
- ఎస్సీ, ఎస్టీ, బీసీ కమిషన్‌ల కుల గణనల సర్వే ఆధారంగానే రిజర్వేషన్లు ఖాయం?
- వార్డు సభ్యుల నుంచి సర్పంచ్, జడ్పీటీసీ, ఎంపీటీసీల రిజర్వేషన్ల కేటాయింపు

ఎన్నికల నిర్వహణకు అధికారులు చకచకా ఏర్పాట్లు చేస్తున్నారు. కలెక్టర్ హనుమంతరావు సోమవారం జడ్పీ సీఈవో, జిల్లా పంచాయతీ అధికారి, ఎంపీడీవోలు, మండల పంచాయతీ అధికారులు, ఇతర సిబ్బందితో సమావేశమయ్యారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో తీసుకోవాల్సిన మార్గదర్శకాలు, సూచనలపై చర్చించారు. జిల్లాలో మొత్తం 17 జడ్పీటీసీ స్థానాలు, 178 ఎంపీటీసీలు, 427 సర్పంచ్, 3,704వార్డు స్థానాలకు ఎన్నికలు జరగనున్నాయి. బీసీలకు 42శాతం రిజర్వేషన్ అమలు చేయనుండటంతో సర్వత్రా ఆసక్తి నెలకొంది. రిజర్వేషన్ల పరిమితిని ఎత్తివేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. పంచాయతీరాజ్ చట్టం-2018 సవరణకు కేబినెట్ ఇటీవల నిర్ణయం తీసుకుంది. రొటేషన్ పద్ధతిలో రిజర్వేషన్లు కేటాయించనుండటంతో కొత్తగా ఏ స్థానం ఎవరికి రిజర్వు అవుతుందనే దానిపై నేతల్లో ఉత్కంఠ నెలకొంది. బీసీ డెడికేటెడ్ కమిషన్ ఆధ్వర్యంలో చేపట్టిన సామాజిక, ఆర్థిక, కుల గణనలో ఉన్న బీసీ జనాభా వివరాలు, ఎస్సీ, ఎస్టీ జనాభా సమాచారం, వార్డులు, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, జడ్పీటీసీ స్థానాల వారీగా ఇవ్వనున్నారు. ఆ లెక్కల ఆధారంగా రిజర్వేషన్ చేపట్టనున్నారు. అయితే ముందుగా మహిళల రిజర్వేషన్లు తేలితేనే కొలిక్కి వచ్చే అవకాశం ఉంది. మండలాల్లో జనాభా ఆధారంగా రిజర్వేషన్లు కల్పిస్తారు. అయితే ఏ ప్రాతిపాదికన తీసుకోవాలన్న అంశంపై తర్జన భర్జన పడుతున్నారు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు రిజర్వేషన్ల ప్రక్రియను ఓ కొలిక్కి తెచ్చేందుకు ప్రయత్నాలు చేస్తున్నారు. రొటేషన్ పద్ధతిలో సీట్లు కేటాయించనుండటంతో గత ఎన్నికల్లో ఉన్న రిజర్వేషన్ కేటగిరి ఈసారి ఉండదు. అందుకని రిజర్వేషన్లు మొదటి నుంచి నేతల్లో వణుకు పుట్టిస్తున్నాయి. స్థానిక సంస్థల ఎన్నికల్లో ఆశావహుల తలరాత దీనిపై ఆధారపడి ఉంది. రిజర్వేషన్ల స్థానాల కేటాయింపుపై రాజకీయ పార్టీల నేతలు ఉత్కంఠతో ఎదురుచూస్తున్నారు.

పల్లెల్లో రాజకీయ సందడి

స్థానిక సంస్థల ఎన్నికల నిర్వహణపై ప్రభుత్వం నుంచి స్పష్టత రావడంతో పోటీ చేయాలనుకున్న ఆశావహులతో పల్లెల్లో రాజకీయ సందడి మొదలైంది. అయితే రిజర్వేషన్ల కేటాయింపుపై ఏ స్థానం ఎవరికి వస్తుందనే గుబులు నేతల్లో మొదలైంది. బీసీలకు 42శాతం రిజర్వేషన్లు కాంగ్రెస్ పార్టీ ఇస్తుండటంతో, ఇతర పార్టీలు కూడా తప్పకుండా అమలు చేయాల్సి వస్తుంది. ఈ నేపథ్యంలో రాజకీయ పార్టీలు స్థానికంగా పట్టున్న నేతలపై దృష్టి కేంద్రీకరిస్తున్నాయి. ఇప్పటికే ఫలానా వ్యక్తి ఈసారి ఎన్నికల్లో పోటీ చేయాలని ప్రయత్నాలు చేస్తున్నారని విస్తృతంగా ప్రచారం జరిగింది. అయితే రిజర్వేషన్లపై తేలే వరకు ఆశావహుల్లో ఉత్కంఠ నెలకొంది. పల్లెల్లో ముందుగానే స్థానిక సంస్థల ఎన్నికల వాతావరణం నెలకొంది. పల్లెల్లోని రచ్చబండల వద్ద ఏ పార్టీ నుంచి ఎవరెవరు బరిలో ఉంటారన్న చర్చలు మొదలయ్యాయి. జిల్లాలోని ఆయా మండలాల్లో జడ్పీటీసీ, ఎంపీపీ, ఎంపీటీసీలతోపాటు సర్పంచులుగా పోటీ చేయాలనుకుంటున్న ఆశావహులు ప్రజలతో...

- మిగతా 8వ పేజీలో...



యాదగిరిగుట్టలో బాలాత్రిపుర సుందరి దేవిగా అమ్మవారు

బాలా త్రిపుర సుందరిదేవిగా అమ్మవారు

భువనగిరిటౌన్, సెప్టెంబరు 22 (ఆంధ్రజ్యోతి): దేవీ నవరాత్రి ఉత్సవాలు జిల్లాలో సోమవారం ఘనంగా ప్రారంభమయ్యాయి. జిల్లావ్యాప్తంగా సుమారు 300పైగా అమ్మవారి విగ్రహాలను ప్రతిష్ఠించారు. మండపాలను శోభాయమానంగా అలంకరించారు. జిల్లా కేంద్రం భువనగిరి పట్టణంలో తొలి పూజలను భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. తొలిరోజున బాలాత్రిపురసుందరిదేవి అలంకరణలో అమ్మవారు దర్శనమిచ్చారు. బీజేపీ రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు ఎన్.రామచందర్‌రావు, వేముల అశోక్ తదితర ప్రముఖులు తొలి పూజల్లో పాల్గొన్నారు. బతుకమ్మ వేడుకలు రెండో రోజున ఉత్సాహంగా జరుపుకున్నారు.

హైవేలకు భూసేకరణ చేయాలి

కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్‌లో సీఎం రేవంత్‌రెడ్డి



వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడుతున్న రేవంత్‌రెడ్డి, పాల్గొన్న కలెక్టర్ హనుమంతరావు, అదనపు కలెక్టర్ అధికారులు

భువనగిరి (కలెక్టరేట్), సెప్టెంబరు 22 (ఆంధ్రజ్యోతి): జాతీయ రహదారుల నిర్మాణంతో రవాణా సౌకర్యాలు మెరుగుపడి రాష్ట్రాభివృద్ధి సాధ్యమవుతుందని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అన్నారు. తెలంగాణాలో జాతీయ రహదారుల నిర్మాణానికి అవసరమైన భూసేకరణపై సోమవారం బీఆర్ అంబేడ్కర్ సచివాలయం నుంచి అన్ని జిల్లాల కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించారు. దసరా పండుగకు ముందే భూసేకరణ పూర్తి కావాలని, కోర్టు కేసులు ఉన్న భూముల వివరాలను వెంటనే ప్రభుత్వానికి పంపాలన్నారు. టైటిల్ సమస్యలు, ఇతర భూ సమస్యలు ఉన్న భూముల విషయంలో పరిహారం మొత్తాన్ని డిపాజిట్‌చేసి భూములను సేకరించాలని ఆదేశించారు. రహదారి నిర్మాణ పనులు ఆలస్యం కాకుండా అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. జాతీయ రహదారుల నిర్మాణం రాష్ట్రాభివృద్ధికి కీలకమన్నారు. కాన్ఫరెన్స్‌లో కలెక్టర్ హనుమంతరావు, అదనపు కలెక్టర్ (రెవెన్యూ) వీరారెడ్డి, జిల్లా అటవీ అధికారి పద్మజా రాణి, భువనగిరి, చౌటుప్పల్ ఆర్డీవోలు కృష్ణారెడ్డి, శేఖర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పోలీస్ స్కూల్ నిర్మాణానికి విరాళం

సీఎంకు రూ.30లక్షల చెక్కు అందజేసిన ఎమ్మెల్యే కుంభం



సీఎంకు చెక్కును అందజేస్తున్న అనిల్‌కుమార్‌రెడ్డి

భువనగిరి (కలెక్టరేట్), సెప్టెంబరు 22 (ఆంధ్రజ్యోతి): హైదరాబాద్ మంచిరేవుల వద్ద యంగ్ ఇండియా పోలీస్ స్కూల్ నిర్మాణానికి తనవంతుగా భువనగిరి ఎమ్మెల్యే కుంభం అనిల్ కుమార్ రెడ్డి విరాళం అందజేశారు. ఈమేరకు సోమవారం సచివాలయంలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని కలిసి రూ.30లక్షల చెక్కును అందజేశారు. ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా ఏర్పాటు చేస్తున్న యంగ్ ఇండియా పోలీసు స్కూల్ నిర్మాణానికి చేయూతనివ్వడం అభినందనీయమన్నారు. ఈ సందర్భంగా తన భువనగిరి నియోజకవర్గంలోని రుద్రవెల్లి-జూలూరు బ్రిడ్జి నిర్మాణానికి నిధులు కేటాయించాలని కోరగా ముఖ్యమంత్రి సానుకూలంగా స్పందించినట్లు ఎమ్మెల్యే అనిల్ కుమార్ రెడ్డి తెలిపారు.

లింగ నిర్ధారణ పరీక్షలు నేరం

భువనగిరి (కలెక్టరేట్), సెప్టెంబరు 22 (ఆంధ్రజ్యోతి): లింగ నిర్ధారణ పరీక్షలు నేరమని జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి ఎం.మనోహర్ అన్నారు. కలెక్టరేట్‌లోని డీఎంహెచ్‌వో కార్యాలయంలో సోమవారం పీసీపీఎన్‌డీటీ (ప్రీ కన్సెప్షన్ అండ్ ప్రీనాటల్ డయోగ్నస్టిక్ టెక్నిక్) చట్టం అమలుపై అడ్వయిజరీ కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడారు. జిల్లాలో ఏర్పాటు చేసిన స్కానింగ్ కేంద్రాల్లో నిర్వాహకులు ఆడ, మగ లింగ నిర్ధారణ చేస్తే చట్టరీత్యా కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. ఆడ మగ సమానమని ప్రజల్లో అవగాహన పెంచేలా కార్యక్రమాలు నిర్వహించాలన్నారు. ముఖ్యంగా గర్భిణులకు సమతుల ఆహారంపై అవగాహన కల్పించి ప్రభుత్వ ఆస్పత్రుల్లో ప్రసవాలు జరిగేలా చూడాలన్నారు. సమావేశంలో పీసీపీఎన్‌డీటీ ప్రోగ్రాం ఆఫీసర్ యశోద, డిప్యూటీ డీఎంహెచ్‌వో శిల్పిని, ప్రమీల, నాగరాజు, శివలింగం, అంజయ్య తదితులు పాల్గొన్నారు.

జీఎస్టీ తగ్గింపుతో రైతులకు ఊరట లభించనుంది. గతంలో యాంత్రీకరణ పరికరాలపై పెద్ద ఎత్తున అంటే 18శాతం వరకు జీఎస్టీ ఉండేది. ప్రస్తుతం ఐదు శాతానికి తగ్గడంతో పరికరాల ధరలు తగ్గుముఖం పట్టాయి. అదే విధంగా యాంత్రీకరణ పథకాన్ని పారదర్శకంగా అమలు చేయడం కోసం ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా వ్యవసాయ శాఖ మండల స్థాయిలో త్రీమెన్ కమిటీల నుంచి తీర్మానాలను సేకరిస్తుంది.

- (ఆంధ్రజ్యోతి-నల్లగొండ)



జీఎస్టీ తగ్గింపుతో రైతులకు ఊరట

- తగ్గనున్న 15 రకాల యంత్రాల ధరలు
- యాంత్రీకరణకు త్రీమెన్ కమిటీల తీర్మానాలు
- జిల్లా కమిటీలకు మండలస్థాయి అధికారుల సిఫారసులు
- వచ్చే నెల 15లోగా పరికరాల పంపిణీకి సన్నాహాలు

యాంత్రీకరణ పథకం అమలు కోసం ముందుగా త్రీమెన్ కమిటీల తీర్మానాలు చేపడుతున్నారు. ఈ కమిటీలో తహసీల్దార్, మండల వ్యవసాయ అధికారి, ఎంపీడీవో ఉంటారు. వీరు ముగ్గురు ఆయా మండలాల్లో వచ్చిన దరఖాస్తులను పరిశీలించి అర్హులైన జాబితాను జిల్లా కమిటీలకు సిఫారసు చేస్తారు. జిల్లా కమిటీలో జిల్లా వ్యవసాయ అధికారులతోపాటు శాస్త్రవేత్తలు తుది జాబితాను ఎంపికచేసి ఆయా జిల్లా కలెక్టర్లకు సమర్పిస్తారు. ఇప్పటికే రెండుసార్లు వివిధ కారణాలతో వాయిదా పడిన నేపథ్యంలో పథకాన్ని త్వరగా పూర్తి చేయాలని నిర్ణయించారు. యూరియా కోసం రైతులు పెద్దఎత్తున క్యూకట్టిన నేపథ్యంలో తెలంగాణలోని అన్ని జిల్లాలతోపాటు ఉమ్మడి నల్లగొండ జిల్లాలోని యాదాద్రి భువనగిరి, సూర్యాపేట, నల్లగొండ జిల్లాలో ఈ పథకాన్ని తాత్కాలికంగా వాయిదా వేశారు.

పరికరాల ధరలు తగ్గుముఖం

కేంద్ర ప్రభుత్వం జీఎస్టీ స్లాబ్‌లను నాలుగు నుంచి రెండు చేయడంతోపాటు సామాన్య ప్రజలపై భారం పడకుండా మార్పులు చేశారు. దీంతో రైతులపై కూడా భారం తగ్గనుంది. గతంలో యాంత్రీకరణ పరికరాలపై పెద్ద ఎత్తున అంటే 18శాతం వరకు జీఎస్టీ ఉండేది. ప్రస్తుతం 5శాతానికి తగ్గడంతో పరికరాల ధరలు తగ్గుముఖం పట్టాయి. జీఎస్టీ తగ్గించడంతో ఆయా కంపెనీలు కూడా వ్యవసాయ శాఖ అధికారులకు తగ్గించిన రేట్లను సవరించి పంపడంతో పథకంలో చేర్పులు మార్పులు చేస్తున్నారు. పథకం అమలు కంటే ముందే జీఎస్టీ తగ్గడంతో రైతులకు ఎంతో ప్రయోజనం ఉందని చెప్పవచ్చు. మొత్తం 15 రకాల పరికరాలకు సంబంధించి ధరలు తగ్గనున్నాయి. ఆధునిక వ్యవసాయాన్ని ప్రోత్సహించడంకోసం రాష్ట్ర ప్రభుత్వం ఈ పథకాన్ని పునరుద్ధరించింది. పరికరాల్లో ప్రధానంగా రోటోవేటర్లు, నాగళ్లు, కల్టివేటర్లు, స్ప్రేయర్లు, పవర్ వీడర్లు, డ్రోన్లు ...

- మిగతా 7వ పేజీలో...

జీఎస్టీ సంస్కరణలతో ఆర్థిక వ్యవస్థ బలోపేతం



సమావేశంలో మాట్లాడుతున్న బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రాంచందర్‌రావు

- బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్.రాంచందర్‌రావు

యాదాద్రి, భువనగిరి టౌన్, సెప్టెంబరు 22 (ఆంధ్రజ్యోతి): జీఎస్టీలోని సంస్కరణల తో ప్రపంచంలోనే మూడో అగ్రరాజ్యంగా భారత్ అవతరించనుందని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్.రాంచందర్‌రావు తెలిపారు. భువనగిరిలో ని గంజ్ మార్కెట్‌యార్డులో జీఎస్టీ సంస్కరణలను అమలు చేసినందుకు ప్రధానమంత్రికి కృతజ్ఞతగా వర్తకులు సోమవారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా రాంచందర్‌రావు మాట్లాడుతూ కేంద్రం ప్రవేశపెట్టిన జీఎస్టీ సంస్కరణలతో ఆర్థిక వ్యవస్థ బలోపేతం అవుతుందన్నారు. సామాన్యులకు సైతం లగ్జరీ వస్తువులు కొనుగోలు చేసే అవకాశం ఉంటుందన్నారు. ప్రజల పై పన్నులు తగ్గించడంతో ఉత్పత్తులు పెరగడంతో పాటు సామాన్య ప్రజలకు భారం తగ్గుతుందన్నారు. జీఎస్టీ తగ్గడంతో కొనుగోలు శక్తి పెరిగి ఎక్కువ స్థాయిలో పన్నులు వసూలవుతాయని తెలిపారు. కేంద్ర ప్రభుత్వం ఏడాదికి పెద్దఎత్తున ఆదాయాన్ని కోల్పోతున్నా ప్రధాని సాహసోపేత నిర్ణయం తీసుకున్నారని తెలిపారు. జీఎస్టీ తగ్గించాలని డిమాండ్ చేసిన రాజకీయ పార్టీల సంస్కరణలు తీసుకురావడంతో నోరు మెదపడంలేదని విమర్శించారు. చాలావరకు పలు వస్తువులు అమెరికా, చైనా, జపాన్, తదితర దేశాల నుంచి దిగుమతి చేసుకుంటున్నామని, ఇతర దేశాల ఉత్పత్తులపై ఆధార పడటంతో అధికంగా పనులు చెల్లించాల్సి వస్తోందని తెలిపారు. స్వదేశీ వస్తువుల వాడకంతో ఆదాయం పూర్తిగా కేంద్ర ప్రభుత్వానికి చేరుతుందన్నారు. సమావేశంలో ఎమ్మెల్సీ అంజిరెడ్డి, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వేముల అశోక్, రాష్ట్ర ఉపాధ్యక్షుడు డాక్టర్ బూర నర్సయ్యగౌడ్, కాసం వెంకటేశ్వర్లు, జిల్లా అధ్యక్షుడు ఊట్కూరి అశోక్‌గౌడ్ పాల్గొన్నారు. అంతకుముందు ప్రధాని మోదీ చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. కార్యక్రమాల్లో ఎమ్మెల్సీ జనార్ధన్‌రెడ్డి, మాజీ ఎంపీ డాక్టర్ బూర నర్సయ్యగౌడ్, బీజేపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వేముల అశోక్, వ్యాపార సంఘాల ప్రతినిధులు మంచాల రుషికేష్, పసుపునూరి మనోహర్, చింత రవీంద్ర, కూరెళ్ల జనార్ధన్, గడ్డం శ్రీనివాస్, బీజేపీ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు ఊట్కూరి అశోక్‌గౌడ్, చందా మహేందర్‌గుప్తా, రాష్ట్ర ఉపాధ్యక్షుడు డాక్టర్ కాసం వెంకటేశ్వర్లు, రాష్ట్ర కార్యవర్గసభ్యులు పాశం భాస్కర్, గూడూరు నారాయణరెడ్డి, పోతంశెట్టి రవీందర్, జీఎస్టీ జిల్లా కన్వీనర్ శేఖర్, పట్టణ అధ్యక్షులు రత్నపురం బలరాం, మునిసిపల్ మాజీ వైస్ చైర్మన్లు నర్ల నర్సింగరావు, మాయ దశరథ తదితరులు పాల్గొన్నారు.

ఉద్యోగినులపై వేధింపులు ఆపాలి

ఎస్సీ డెవలప్‌మెంట్ కార్యాలయం ముట్టడిలో ఉద్యోగులు



భగత్‌కు వినతిపత్రం అందజేస్తున్న ఎస్సీ సంక్షేమ శాఖ ఉద్యోగులు

భువనగిరి (కలెక్టరేట్), సెప్టెంబరు 22 (ఆంధ్రజ్యోతి): ఒంటరి మహిళా ఉద్యోగినులపట్ల అనుచిత వ్యాఖ్యలు చేస్తూ, కక్ష సాధింపు చర్యలకు పాల్పడుతున్న ఇన్‌చార్జి జిల్లా షెడ్యూల్డ్ కులాల అభివృద్ధి అధికారి శ్యాంసుందర్‌పై చర్యలు తీసుకోవాలని పలు ఉద్యోగ సంఘాలు డిమాండ్ చేశాయి. ఈ మేరకు సోమవారం జిల్లా షెడ్యూల్డ్ కులాల అభివృద్ధి అధికారి కార్యాలయాన్ని ముట్టడించి శ్యాంసుందర్‌కు వ్యతిరేకంగా నినాదాలుచేశారు. ఈ సందర్భంగా టీఎన్జీవో, హాస్టల్ వెల్ఫేర్ అసోసియేషన్, ఎస్సీ డెవలప్‌మెంట్ మినిస్టీరియల్ స్టాఫ్ అసోసియేషన్ నాయకులు మాట్లాడుతూ షెడ్యూల్డ్ కులాల అభివృద్ధి అధికారి శ్యాంసుందర్ ఆగడాలు మితిమీరిపోయాయని, ఉద్యోగులు, సిబ్బందిపై శాడిజం ప్రదర్శిస్తున్నారని ఆరోపించారు. అసభ్య పదజాలంతో మానసికంగా వేధిస్తున్నారని, తమ శాఖకు సంబంధించిన సమస్యల పరిష్కారంకోసం కలెక్టర్‌ను కలిస్తే కక్ష సాధింపు చర్యలకు పాల్పడుతున్నారని, సదరు అధికారిని తొలగించాలని డిమాండ్ చేశారు. శ్యాంసుందర్ ఉంటే తాము విధులు నిర్వర్తించలేమని, తక్షణమే కలెక్టర్ చర్యలు తీసుకోవాలని కోరారు. అనంతరం టీఎన్జీవో జిల్లా అధ్యక్షుడు భగత్‌కు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో టీఎన్జీవో జిల్లా కార్యదర్శి ఖదీర్, హాస్టల్ వెల్ఫేర్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షురాలు శైలజ, అసోసియేట్ ప్రెసిడెంట్ ఆనంద్, ఎస్సీ అభివృద్ధి మినిస్టీరియల్ ఉద్యోగుల అసోసియేషన్ అధ్యక్షుడు సత్యనారాయణ, సూపరింటెండెంట్ జ్యోతిర్మయి, పలు ఉద్యో సంఘాల నాయకులు పాల్గొన్నారు.

'ప్రజావాణి' దరఖాస్తులను పరిష్కరించాలి

అదనపు కలెక్టర్ (రెవెన్యూ) వీరారెడ్డి

భువనగిరి (కలెక్టరేట్), సెప్టెంబరు 22 (ఆంధ్రజ్యోతి): ప్రజావాణిలో వచ్చిన దరఖాస్తులను వేగంగా పరిశీలించి పరిష్కరించాలని అదనపు కలెక్టర్ (రెవెన్యూ) జీ.వీరారెడ్డి అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్‌లో సోమవారం జరిగిన ప్రజావాణిలో ప్రజల నుంచి 75 దరఖాస్తులను స్వీకరించారు. వాటిలో అత్యధికంగా రెవెన్యూ శాఖకు 50 అర్జీలు రాగా, జిల్లా పంచాయతీకి 6, మునిసిపాలిటీ 4, మహిళా శిశు సంక్షేమ శాఖ, జిల్లా గ్రామీణాభివృద్ధి శాఖలకు 3, పోలీస్ శాఖ లీడ్ బ్యాంకులకు 2, విద్యుత్ శాఖ, మదర్ డెయిరీ, నీటి పారుదల శాఖ, ఆహార భద్రత, గ్రంథాలయ శాఖలకు ఒక్కోటి చొప్పున వచ్చాయని తెలిపారు. వివిధ శాఖలకు వచ్చిన దరఖాస్తుల సమస్యల పరిష్కారానికి కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో జిల్లా రెవెన్యూ అధికారి జయమ్మ, డీఆర్డీవో నాగిరెడ్డి, ఏవో జగన్‌మోహన్ ప్రసాద్, గృహ నిర్మాణ శాఖ పీడీ విజయ్‌సింగ్ పాల్గొన్నారు.

ఫిర్యాదులు, సమస్యలు ఇలా..

- ఆరు నెలలుగా పాడి రైతులకు పెండింగ్‌లో ఉన్న మదర్ డెయిరీ పాల బిల్లులు వెంటనే చెల్లించాలని, లీటరుకు రూ.4 బోనస్ హామీని నిలబెట్టుకోవాలని సీపీఐ ఆధ్వర్యంలో రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి కొల్లూరి రాజయ్య వినతిపత్రం అందజేశారు. నష్టాల్లో ఉన్న మదర్ డెయిరీని, పాడి రైతులను ఆదుకోవాలన్నారు.
- రీజినల్ రింగ్ రోడ్ నిర్మాణానికి భూములు కోల్పోతున్న తమకు నష్ట పరిహారం ఎకరానికి రూ.40లక్షలు ఇవ్వాలని వలిగొండ మండల రైతులు కోరారు. మండలంలోని ప్రొద్దుటూరు, ఏదుళ్లగూడెం, మందాపురం, నాతాళ్లగూడెం గ్రామాలకు చెందిన భూనిర్వాసితులు అదనపు కలెక్టర్‌కు వినతిపత్రం అందజేశారు.
- కుక్కల నియంత్రణకు ఏర్పాటు చేసిన ఆస్పత్రితో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని భువనగిరి మండలం హనుమాపురం గ్రామస్థులు ఫిర్యాదు చేశారు. కుక్కల ఆసుపత్రిని వెంటనే తరలించాలని కోరారు.



అదనపు కలెక్టర్‌కు వినతిపత్రం ఇస్తున్న అర్జీదారులు

ఆధ్యాత్మిక బాటలో అతివలు



తిరుపతిలో సేవా కార్యక్రమాల్లో పాల్గొన్న మఠంపల్లికి చెందిన మహిళా బృందం(ఫైల్)

(ఆంధ్రజ్యోతి-మఠంపల్లి)

సూర్యాపేట జిల్లా మఠంపల్లి మండల కేంద్రానికి చెందిన పలువురు శ్రీ వాసవి మహిళా సేవా సమితి ఆధ్వర్యంలో ఆధ్యాత్మిక బాటలో ముందుకు సాగుతున్నారు. ఆలయాల్లో, క్షేత్రాల్లో పర్వదినాల్లోనే కాకుండా ఇతర రోజుల్లో జరిగే సేవలకు వెళ్తున్నారు. ఎక్కడ ఆధ్యాత్మిక కార్యక్రమాలు జరిగినా మఠంపల్లి మండల కేంద్రానికి చెందిన ఈ సంఘానికి పిలుపు వస్తుంది. దూర ప్రాంతమైనా వెళ్లి ఆలయాల్లో ఆధ్యాత్మిక క్రతువులో పాల్గొంటున్నారు. దేవాలయాల వార్షికోత్సవాలు, బ్రహ్మోత్సవాలు, దేవాలయాల ప్రారంభోత్సవాలు, శంకుస్థాపనలు మాత్రమే కాకుండా తిరుమల శ్రీవారి సన్నిధిలో, యాదగిరిగుట్ట, మట్టపల్లి వంటి దేవాలయాల్లోనూ భజన కార్యక్రమాలకు వెళ్తున్నారు. రాష్ట్రంలోనే కాకుండా ఆంధ్రప్రదేశ్‌లోని పలు దేవాలయాలను చుట్టొస్తున్నారు. తాజాగా మఠంపల్లి నుంచి 30మంది మహిళలు ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని తిరుపతి క్షేత్రానికి వెళ్లి సేవా కార్యక్రమంలో పాల్గొన్నారు.

ఆలయాల్లో సేవా కార్యక్రమాలంటే ఇష్టం



ఆలయాల్లో సేవా కార్యక్రమాలు చేయడం అంటే ఇష్టం. తిరుపతిలో సేవకు ఎప్పుడు అవకాశం దొరికినా వెళ్తుంటా. ఇప్పటికే పలుమార్లు వెళ్లొచ్చా. తెలంగాణలోని అన్ని దేవాలయాల్లో జరిగే క్రతువులకూ హాజరవుతున్నా.

- కుక్కడపు సంధ్యారాణి, మఠంపల్లి

సంప్రదాయాలు తెలుస్తాయని...



ఆలయాల్లో జరిగే ఆధ్యాత్మిక ప్రసంగాలు వినటమంటే ఎంతో ఇష్టం. అక్కడ సంస్కృతి, సంప్రదాయాలు, ఆయా దేవాలయాల చరిత్ర తెలుస్తుంది. రాష్ట్రంలో ప్రసిద్ధ ఆలయాల్లో జరిగే ముఖ్య కార్యక్రమాల్లో పాల్గొంటుంటా. తీరిక సమయాల్లో టీవీల్లోనూ చూస్తుంటా.

- కుక్కడపు కవిత మండల వాసి

దైవ క్రతువులకు మొదటి ప్రాధాన్యం...



దైవకార్యక్రమాలు ఎక్కడ జరిగినా హాజరవుతా. తెలంగాణలోని ఆలయాలను దర్శించుకునేందుకు ఎక్కువప్రాధాన్యం ఇస్తా.తిరుపతిసేవా క్రతువులకు వెళ్తుంటా. తీరిక సమయాలలో భజన కార్యక్రమాల్లో పాల్గొంటా.


- చీదెళ్ల స్వాతి, మఠంపల్లి

మా సమితికి మంచి స్పందన



శ్రీ వాసవి మహిళా సేవా సమితి సంఘం చేస్తున్న సేవా కార్యక్రమాలపై భక్తుల నుంచి మంచి స్పందన ఉంది. ఆధ్యాత్మిక కార్యక్రమాలతో వాటి పవిత్రత కాపాడుకునేందుకు అందరూ కృషి చేయాలి. ప్రసిద్ధ దేవాలయాల్లో అవకాశం వచ్చినప్పుడల్లా మా సంఘం ఆధ్యాత్మిక సేవా కార్యక్రమాల్లో పాల్గొనడం ఆనందంగా ఉంటుంది.

- కొత్త శ్యామల, మఠంపల్లి



బాలాత్రిపురసుందరీదేవిగా....

ఉమ్మడి నల్లగొండ జిల్లా వ్యాప్తంగా దేవీశరన్నవరాత్రోత్సవాలు సోమవారం వైభవంగా ప్రారంభమయ్యాయి. తొమ్మిది రోజుల వేడుకల్లో మొదటిరోజు బాలాత్రిపురసుందరీదేవిగా అమ్మవారు దర్శనమిచ్చారు. పలువురు భక్తులు అమ్మవారి మాలధారణతో దీక్ష తీసుకున్నారు. మహిళలు ప్రత్యేక పూజలు నిర్వహించారు. పలుచోట్ల హోమాధికాలు, పూజలు కొనసాగాయి. అన్నిచోట్ల దేవీ మండపాలను సుందరంగా అలంకరించారు.



హాలియాలో కేఎస్ యూత్ ఆధ్వర్యంలో బాలత్రిపురసుందరిదేవిగా అమ్మవారు



నల్లగొండలోని రాక్‌హిల్స్‌లో అమ్మవారి వద్ద పూజల్లో పాల్గొన్న భక్తులు



చిలుకూరులోని రామాలయం వద్ద చిన్నారుల కోసం ప్రత్యేక కార్యక్రమాలు



భూదాన్‌పోచంపల్లిలోని మార్కండేశ్వరస్వామి దేవాలయంలో కుంకుమపూజ



సూర్యాపేటలోని సంతోషిమాత దేవాలయంలో పూజలు చేస్తున్న భక్తులు



దేవరకొండ పాతరామాలయంలో అమ్మవారి విగ్రహం వద్ద భక్తులు



దేవరకొండ వాసవికన్యకాపరమేశ్వరి దేవాలయంలో హోమంలో పాల్గొన్న భక్తులు

ఖిల్లాపై పొంచి ఉన్న ప్రమాదం

● దసరా సెలవులతో పెరిగిన పర్యాటకుల రద్దీ



ఖిల్లాపై ఒరిగిన విద్యుత్ స్తంభం

(ఆంధ్రజ్యోతి-భువనగిరి టౌన్)

యాదాద్రిభువనగిరి జిల్లా కేంద్రంలోని భువనగిరి ఖిల్లాపై పర్యాటకులకు ప్రమాదం పొంచి ఉంది. ఏమాత్రం ఏమరపాటుగా ఉన్నా ప్రమాదాలకు గురికావాల్సిన పరిస్థితి నెలకొంది. సుమారు 50ఏళ్ల కిందట భువనగిరి ఖిల్లాపై అప్పటి పోలీస్ యంత్రాంగం కమ్యూనికేషన్ సెంటర్ ఏర్పాటుచేసింది. ఈ ప్రాంతంలోని పోలీసుల కమ్యూనికేషన్‌కు ఈ కేంద్రం కీలకం. పోలీసుల వాకీటాకీ ఫోన్లు ఖిల్లాపై ఉన్న కేంద్రం సిగ్నల్స్ ఆధారంగానే పనిచేస్తుంటాయి. ప్రస్తుతం కేంద్ర నిర్వహణ రాచకొండ పోలీస్ కమ్యూనికేషన్ విభాగం పరిధిలో ఉండగా, కేంద్రానికి విద్యుత్ కనెక్షన్ కోసం అప్పట్లో హనుమాన్‌వాడ నుంచి ఖిల్లాపైకి ఇనుప స్తంభాలు ఏర్పాటుచేశారు. అయితే ఖిల్లా పైభాగంలో ఇనుపస్తంభం తుప్పుపట్టి రెండువారాల క్రితం విరిగి విద్యుత్‌తీగల రాయిపై పడింది. పక్కనే ఉన్న మరో స్తంభం తీగలు ప్రమాదకరంగా కిందికి వేలాడుతున్నాయి. ఖిల్లాపై పడిపోయిన ఈ తీగల ద్వారానే విద్యుత్ సరఫరా అవుతోంది. దీంతో అక్కడికి వెళ్లే పర్యాటకులు అవగాహన లోపం లేదా ఏమరుపాటుతో విద్యుత్‌తీగలపై కాలు పెట్టినా, తక్కువ ఎత్తుతో వేలాడుతున్న తీగలను తాకినా ప్రమాదం సంభవించే అవకాశాలు ఉన్నాయి. విద్యుత్ తీగల పునరుద్ధరణపై పర్యాటకశాఖ, రాచకొండ పోలీసులు, విద్యుత్‌శాఖ మాటలతోనే సరిపుచ్చుతున్నాయి. పైగా కూలిన స్తంభంతో ముప్పులేదని అంటూనే త్వరలోనే సరిచేస్తామని పేర్కొంటున్నారు. దసరా సెలవులతో పర్యాటకుల రద్దీ పెరిగిన నేపథ్యంలో సరిచేయాలని పర్యాటకులు కోరుతున్నారు.

జీవితంపై విరక్తితో ఆత్మహత్య



వీరస్వామి(ఫైల్‌ఫొటో)

నేరేడుచర్ల, సెప్టెంబరు 22 (ఆంధ్రజ్యోతి) : సూర్యాపేట జిల్లా నేరేడుచర్లకు చెందిన ఓ వ్యక్తి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఎస్‌ఐ రవీందర్ ఎస్‌ఐ తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. నేరేడుచర్ల పట్టణ పరిధిలోని చింతబండలో వీరస్వామి(32) కుటుంబంతో కలిసి నివాసముంటున్నాడు. ఐదేళ్ల నుంచి క్యాన్సర్ వ్యాధితో బాధపడుతూ ప్రస్తుతం హైదరాబాద్‌లో చికిత్స పొందుతున్నాడు. ఈ క్రమంలో తీవ్ర మనస్తాపానికి గురై ఈ నెల 21 రాత్రి స్థానిక వ్యవసాయ మార్కెట్ ఆవరణలోని చెట్టుకు ఉరి వేసుకున్నాడని ఎస్‌ఐ తెలిపారు. వీరస్వామి భార్య లావణ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

విశాఖ ఎక్స్‌ప్రెస్ రైలు ఢీకొని వృద్ధుడు మృతి

మిర్యాలగూడ అర్బన్, సెప్టెంబరు 22 (ఆంధ్రజ్యోతి): విశాఖ ఎక్స్‌ప్రెస్ రైలు ఢీకొట్టిన ప్రమాదంలో ఓ వృద్ధుడు మృతి చెందాడు. ఈ సంఘటన నల్లగొండ జిల్లా మిర్యాలగూడ రైల్వేస్టేషన్ వద్ద సోమవారం జరిగింది. మృతుడి బంధువులు, రైల్వేపోలీసులు తెలిపిన వివరాల ప్రకారం వేములపల్లి మండలం మొల్కపట్నం గ్రామానికి నామిరెడ్డి అనంతరెడ్డి(77) కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్నారు. చికిత్స నిమిత్తం శనివారం చెన్నై నగరంలోని ఆస్పత్రికి వెళ్లి తిరిగి సోమవారం మిర్యాలగూడకు చేరుకున్నాడు.రైల్వేస్టేషన్ రెండోప్లాట్‌ఫాంపై రైలు దిగిన అనంతరెడ్డి రైల్వే ట్రాక్‌దాటుతున్న క్రమంలో నడికుడి వైపు వెళ్తున్న విశాఖ ఎక్స్‌ప్రెస్ రైలు ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో తీవ్రంగా గాయపడ్డ అనంతరెడ్డి అక్కడికక్కడే మృతి చెందారు. సంఘటనా స్థలాన్ని పరిశీలించిన రైల్వేపోలీసులు మృతదేహాన్ని స్థానిక ఏరియాఆస్పత్రికి తరలించి పోస్టుమార్టం పూర్తిచేశారు. అనంతరెడ్డి కుమారుడు శ్రీనివాసరెడ్డి ఫిర్యాదుమేరకు రైల్వే పోలీసులు కేసునమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

గుర్తుతెలియని వాహనం ఢీకొని సెక్యూరిటీ గార్డు

చిట్యాల రూరల్, సెప్టెంబరు 22 (ఆంధ్రజ్యోతి) : గుర్తుతెలియని వాహనం ఢీకొని ప్రైవేట్ సెక్యూరిటీ గార్డు మృతి చెందారు. ఈ సంఘటన నల్లగొండ జిల్లా చిట్యాల మండలం గుండ్రాంపల్లి శివారులో ఆదివారం రాత్రి జరిగింది. ఎస్‌ఐ మమిడి రవికుమార్ తెలిపిన వివరాల ప్రకారం మధ్యప్రదేశ్ రాష్ట్రానికి చెందిన విపుల్‌కుమార్(18) కుటుంబం రాజస్థాన్‌లో నివాసం ఉంటోంది. ఉపాధి నిమిత్తం రాజస్థాన్ ఇంటెలిజెన్స్ సెక్యూరిటీ ఏజెన్సీ ద్వారా విపుల్‌కుమార్ మండలంలోని గుండ్రాంపల్లి శివారులోని శ్రీపతిల్యాబ్ ఫార్మా పరిశ్రమలో రెండు మాసాలుగా సెక్యూరిటీ గార్డుగా పనిచేస్తున్నాడు. గుండ్రాంపల్లిలో అద్దె ఇంట్లో ఉంటున్నాడు. ఆదివారం విధులు ముగించుకుని రాత్రి ఇంటికి వెళ్తున్నాడు. మార్గమధ్యలో డబుల్ బెడ్‌రూం ఇళ్ల సమీపంలో యూటర్న్ వద్ద రోడ్డు దాటుతున్నాడు. ఈ క్రమంలో గుర్తుతెలియని వాహనం ఢీకొట్టింది. ఈ ఘటనలో విపుల్‌కుమార్ రోడ్డుపై పడగా వాహనాలు అతడి పైనుంచి వెళ్లడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. సెక్యూరిటీ ఏజెన్సీ అధికారి సందీప్‌కుమార్ దూబే ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్‌ఐ రవికుమార్ తెలిపారు.

గుండెపోటుతో హెడ్‌కానిస్టేబుల్...



నజీరొద్దీన్(ఫైల్)

మిర్యాలగూడ అర్బన్, సెప్టెంబరు 22 (ఆంధ్రజ్యోతి): గుండెపోటుతో ట్రాఫిక్ పోలీస్‌స్టేషన్ హెడ్ కానిస్టేబుల్ మృతి చెందారు. నల్లగొండ జిల్లా మిర్యాలగూడ ట్రాఫిక్ పోలీస్‌స్టేషన్‌లో హెడ్‌కానిస్టేబుల్‌గా పనిచేస్తున్న సయ్యద్ నజీరొద్దీన్(56) ఆదివారం రాత్రి బతుకమ్మ వేడుకల వద్ద విధులు ముగించుకొని ఇంటికివెళ్లారు. ఛాతినొప్పితో కుప్పకూలగా కుటుంబసభ్యులు స్థానిక ఆస్పత్రికి తరలించగా అప్పటికే పరిస్థితి విషమించడంతో మెరుగైన వైద్యం కోసం నార్కట్‌పల్లి కామినేని ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ సోమవారం తెల్లవారుజామున మృతి చెందినట్లు కుటుంబసభ్యులు తెలిపారు. సూర్యాపేట జిల్లా భీమారం గ్రామానికి చెందిన నజీరొద్దీన్ 1995లో ఉద్యోగంలో చేరారు. కొన్నేళ్లుగా మిర్యాగూడ డివిజన్‌లోనే విధులు నిర్వహిస్తూ పట్టణంలోని శాంతినగర్‌లో స్థిరనివాసం ఏర్పాటు చేసుకుని ఉంటున్నాడు. అతడి మృతికి వన్‌టౌన్ సీఐ నాగభూషణం, టూటౌన్ సీఐ సోమనర్సయ్య, ట్రాఫిక్ ఎస్‌ఐ శ్రీనివాస్, పోలీస్ సంఘం నల్లగొండ జిల్లా అధ్యక్షుడు జయరాజ్, హోంగార్డుల సంఘం జిల్లా నాయకుడు కోడిరెక్క కిరణ్‌కుమార్, ట్రాఫిక్ పోలీస్ సిబ్బంది సంతాపం వ్యక్తం చేశారు. నజీరొద్దీన్‌కు భార్య, కుమారుడు, కుమార్తె ఉన్నారు. అమెరికాలో ఉన్న కుమారుడు వచ్చిన అనంతరం నజీరొద్దీన్ అంత్యక్రియలు పోలీస్ లాంఛనాల మధ్య నిర్వహించనున్నట్లు కుటుంబసభ్యులు, పోలీస్ అధికారులు తెలిపారు.

మల్లాపురంలో పిడుగుపాటుకు ఆవు మృతి

యాదగిరిగుట్ట రూరల్, సెప్టెంబరు 22 (ఆంధ్రజ్యోతి) : యాదాద్రిభువనగిరి జిల్లా యాదగిరిగుట్ట మండలం మల్లాపురంలో పిడుగుపాటుకు ఆవు మృతి చెందింది. భీమానాయక్ పాడి ఆవు సమీపంలో ఆదివారం రాత్రి పిడుగుపడి మృతి చెందింది.

కుమార్తెను హత్య చేసిన తండ్రి అరెస్ట్



వివరాలు వెల్లడిస్తున్న సూర్యాపేట పట్టణ ఇన్‌స్పెక్టర్ వెంకటయ్య

సూర్యాపేట క్రైం, సెప్టెంబరు 22 (ఆంధ్రజ్యోతి) : అభంశుభం తెలియని ఏడాది వయసున్న కుమార్తెను హత్యచేసిన తండ్రిని అరెస్ట్ చేసినట్లు సూర్యాపేట జిల్లా కేంద్ర పట్టణ ఇన్‌స్పెక్టర్ వెంకటయ్య తెలిపారు. సోమవారం పట్టణ పోలీస్‌స్టేషన్‌లో విలేకరుల సమావేశంలో కేసు వివరాలు వెల్లడించారు. నాగారం మండలం డీ-కొత్తపల్లి గ్రామానికి చెందిన గైగుళ్ల వెంకటేష్ యాదాద్రిభువనగిరి జిల్లా గుండాల మండలానికి చెందిన కవితను వివాహమాడాడు. ఏడాది తర్వాత ఇద్దరి మధ్య గొడవలు జరగడంతో పెద్దల సమక్షంలో విడిపోయారు. అనంతరం 2023లో ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం పల్నాడు జిల్లా సిరిగిరిపాడు గ్రామానికి చెందిన నాగమణితో రెండో వివాహమైంది. అనంతరం కొన్నాళ్ల పాటు గ్రామంలోనే జీవించారు. వారికి 2024 అక్టోబరు 10న కుమార్తె భవిజ్ఞ జన్మించింది. కొంతకాలంగా మద్యం సేవిస్తూ ప్రతి రోజూ భార్యతో గొడవ పడుతున్నాడు. ఈ క్రమంలో నిన్ను, కుమార్తెను చంపి మళ్లీ మూడో పెళ్లి చేసుకుంటానని అంటుండడంతో భయంతో భార్య నాగమణి రెండు నెలల క్రితం తల్లిగారింటికి వెళ్లింది. ఇటీవల పెద్దమనుషులు, వెంకటేష్ కుటుంబసభ్యులు భార్య నాగమణికి సర్దిచెప్పి కాపురానికి తీసుకవచ్చారు. ఇటీవల సూర్యాపేటలోని ప్రియాంక కాలనీలో ఓ ఇల్లును అద్దెకు తీసుకున్నారు. ఈ నెల 19న రాత్రి వెంకటేష్ మద్యం సేవించి వచ్చి భార్యతో గొడవపడ్డాడు. భార్య నాగమణిని కొడుతుండగా కుమార్తె భవిజ్ఞ నిద్రలేచి ఏడుస్తూ తల్లి దగ్గరికి వెళ్లింది. ఆ సమయంలో నిందితుడు వెంకటేష్ భార్య నాగమణి కుడిచేతిని కొరికి ఆమెను గోడకు నెట్టివేసి 11నెలలు కుమార్తె భవిజ్ఞ రెండు కాళ్లు పట్టుకుని నేలకు గట్టిగా బాదాడు. దీంతో భవిజ్ఞ తలకు తీవ్రగాయాలై మృతి చెందింది. భార్య నాగమణి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేసినట్లు సీఐ తెలిపారు. కాగా విశ్వసనీయ సమాచారం మేరకు నిందితుడు వెంకటేష్ సోమవారం తన ద్విచక్రవాహనంపై సూర్యాపేట నుంచి జనగాం రోడ్డు వైపు వెళ్తుండగా అంజనాపురి కాలనీ క్రాస్ రోడ్డు వద్ద అదుపులోకి తీసుకుని కోర్టుకు రిమాండ్‌కు తరలిస్తున్నట్లు ఇన్‌స్పెక్టర్ తెలిపారు. సమావేశంలో సిబ్బంది జానీ, రవి ఉన్నారు.

అనుమానమే పెనుభూతమై

రోకలిబండతో హత్యచేసిన భర్త



రేణుక(ఫైల్)

దేవరకొండ, సెప్టెంబరు 22 (ఆంధ్రజ్యోతి): భార్యపై అనుమానం హత్యకు దారితీసింది. ఆదివారం రాత్రి నల్లగొండ జిల్లా దేవరకొండ పట్టణం చంద్రగిరి కాలనీలో ఈ సంఘటన జరిగింది. దేవరకొండ సీఐ వెంకటరెడ్డి తెలిపిన వివరాలిలా ఉన్నాయి. దేవరకొండకు చెందిన అవిటి గణేష్‌తో రేణుక(35)కు పదేళ్ల కిందట వివాహంకాగా, చంద్రగిరి కాలనీలో నివాసం ఉంటున్నారు. గణేష్ వంటలు చేసి జీవనం సాగిస్తుండగా, వీరికి ఏడేళ్ల కుమారుడు ఉన్నాడు. కొంతకాలంగా భార్యాభర్తల మధ్య గొడవలు జరుగుతుండగా, ఆదివారం రాత్రి కూడా వివాదం నెలకొంది. రేణుక నిద్రిస్తున్న సమయంలో ఆమె తలపై గణేష్ రోకలిబండతో బలంగా కొట్టడంతో అక్కడికక్కడే మృతిచెందింది. పక్కనే నిద్రిస్తున్న కుమారుడు లేచి కేకలు వేయడంతో స్థానికులు వచ్చి పోలీసులకు సమాచారం అందించారు. సంఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు రేణుక మృతదేహాన్ని ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. భార్యపై అనుమానమే హత్యకు కారణమని సీఐ వెంకటరెడ్డి తెలిపారు. నిందితుడిని అదుపులోకి తీసుకున్నామని, రేణుక తల్లి లక్ష్మమ్మ ఫిర్యాదుమేరకు కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

సాగర్ ఎడమకాల్వలో యువకుడు గల్లంతు



సతీష్

వేములపల్లి, సెప్టెంబరు 22 (ఆంధ్రజ్యోతి) : సాగర్ ఎడమకాల్వలో యువకుడు గల్లంతైన సంఘటన నల్లగొండ జిల్లా వేములపల్లి మండలం శెట్టిపాలెం గ్రామ శివారులో సోమవారం జరిగింది. ఎస్‌ఐ వెంకటేశ్వర్లు తెలిపిన వివరాల ప్రకారం శెట్టిపాలెం గ్రామానికి చెందిన బొల్లెద్దు సతీష్(32) గ్రామానికి చెందిన మరో పలువురు యువకులతో కలిసి ఎడమకాల్వలో సోమవారం సాయంత్రం ఈతకు వెళ్లాడు. ఈ క్రమంలో రుత్విక్ అనే బాలుడు ఈత సరిగా రాక నీటి ప్రవాహంలో కొట్టుకుపోతుండగా గమనించిన సతీష్ అతడిని కాపాడి ఒడ్డుకు చేర్చి ఆయాసానికి గురై నీటిప్రవాహంలో గల్లంతయ్యాడు. ఈ మేరకు వారి కుటుంబసభ్యులకు, పోలీసులకు సమాచారం అందించగా కాల్వ వెంట గాలింపు చర్యలు చేపట్టినా ఆచూకీ లభ్యంకాలేదు. ఈ మేరకు గల్లంతైన సతీష్ తమ్ముడు బొల్లెద్దు సైదులు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని సాగర్ ఎడమకాల్వ వెంట గస్తీ నిర్వహిస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

ఇద్దరికి రిమాండ్

నాగార్జునసాగర్, సెప్టెంబరు 22 (ఆంధ్రజ్యోతి) : కోర్టు వాయిదాలకు హాజరుకాకుండా తప్పించుకుని తిరుగుతున్న ఇద్దరిని సోమవారం అరెస్ట్ చేసినట్లు నల్లగొండ జిల్లా సాగర్ ఎస్‌ఐ ముత్తయ్య తెలిపారు. 2022లో ఓ చీటింగ్ కేసులో అరెస్ట్ అయి, కోర్టు వాయిదాలకు హాజరు కాకుండా తప్పించుకుని తిరుగుతున్న వారిపై నాన్‌బెయిలబుల్ వారెంట్ జారీ అయ్యిందన్నారు. నిందితులు ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం వినుకుండలో ఉండగా అక్కడికి వెళ్లి పట్టుకుని నిడమనూరు కోర్టులో హాజరపరిచామన్నారు. నిందితులకు అక్టోబరు 3 వరకు కోర్టు రిమాండ్ విధించిందన్నారు.

ఉపాధి కోల్పోతాం.. ఫ్లైఓవర్ నిర్మించొద్దు



పెట్రోల్ బాటిల్ పట్టుకుని నిరసన తెలుపుతున్న వ్యాపారులు

తిరుమలగిరి, సెప్టెంబరు 22 (ఆంధ్రజ్యోతి) : ఫ్లైఓవర్ బ్రిడ్జి నిర్మాణంతో ఉపాధి కోల్పోతామని, వెంటనే పనులు నిలిపివేయాలని సూర్యాపేట జిల్లా తిరుమలగిరి పట్టణానికి చెందిన చిరువ్యాపారులు, స్థానికులు ఆవేదన వ్యక్తం చేశారు. జాతీయ రహదారి విస్తరణలో భాగంగా తిరుమలగిరి పట్టణంలో చేపడుతున్న ఫ్లైఓవర్ బ్రిడ్జి పనులను అడ్డుకుని ఆందోళన చేపట్టారు. పెట్రోల్ బాటిళ్లు పట్టుకుని పనులు చేపట్టేందుకు వచ్చిన వాహనాలకు అడ్డుగా కూర్చుని, గౌరెల్లి-కొత్తగూడెం రహదారిపై రాస్తారోకో నిర్వహించారు. ఫ్లైఓవర్ బ్రిడ్జితో ఉపాధి అవకాశాలు లేకుండా పోతాయని ఆవేదన వ్యక్తం చేశారు. ఆందోళనలో మాజీ ఎంపీపీ కొమ్మినేని సతీష్, ఎల్సోజు భాస్కర్, కందుకూరి ప్రవీణ్, కొత్తగట్టు మల్లయ్య, గుండా భాస్కర్, గజ్జెల శేఖర్, శ్రీహరి, అక్కల నరేష్ పాల్గొన్నారు.


డ్రంకెన్ డ్రైవ్‌లో జైలుశిక్ష, జరిమానా

సూర్యాపేట క్రైం, సెప్టెంబరు 22 (ఆంధ్రజ్యోతి): మద్యం మత్తులో వాహనాలు నడిపిన పలువురికి జైలు శిక్ష, జరిమానా విధించినట్లు సూర్యాపేట ట్రాఫిక్ ఎస్‌ఐ సాయిరాం సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. పట్టణంలోని పలు ప్రాంతాల్లో ఈ నెల 21న డ్రంకెన్‌డ్రైవ్ తనిఖీలు చేపట్టగా మోతాదుకు మించి మద్యం తాగిన ఆరుగురు పట్టుబడినట్లు తెలిపారు. వారిని సోమవారం సూర్యాపేట ద్వితీయ శ్రేణి కోర్టులో హాజరుపర్చగా ఒకరికి ఒకరోజు జైలు శిక్ష, రూ.2 వేల జరిమానా, మిగిలిన ఐదుగురికి కలిపి రూ.5 వేలు జరిమానా విధిస్తూ న్యాయమూర్తి పీవీ రమణ తీర్పు చెప్పినట్లు తెలిపారు. మద్యం మత్తులో వాహనాలు నడపడంతో ప్రమాదాలు జరిగి విలువైన ప్రాణాలు పోగొట్టుకుంటున్నారని పేర్కొన్నారు.

ఉద్యోగం పేరుతో మోసం, కేసు నమోదు

వలిగొండ, సెప్టెంబరు 22 (ఆంధ్రజ్యోతి) : సాఫ్ట్‌వేర్ ఉద్యోగం ఇప్పిస్తానని మోసం చేసిన వ్యక్తిపై పోలీసులు చీటింగ్ కేసు నమోదు చేశారు. యాదాద్రిభువనగిరి జిల్లా వలిగొండ ఎస్‌ఐ యుగేందర్‌గౌడ్ తెలిపిన వివరాల ప్రకారం వలిగొండ మండల కేంద్రానికి చెందిన కొల్లోజు ప్రేమ్ 2024లో సాఫ్ట్‌వేర్ ఉద్యోగం ఇప్పిస్తామని చెప్పి గురునాథ్‌పల్లికి చెందిన బాసాని నర్సింహ నుంచి రూ.50వేలు తీసుకున్నాడు. అయినా ఉద్యోగం ఇప్పించలేదు సదరు బాధితుడు ఉద్యోగం గురించి ఒత్తిడి చేసినా ఫలితం కనబడలేదు. ఇదిలా ఉండగా నర్సింహ ఓ కంపెనీలో ఉద్యోగానికి వెళ్లగా ప్రొఫైల్ బ్యాక్‌గ్రౌండ్ తనిఖీ చేశారు. అంతకుముందే బ్యాన్ అయిన కంపెనీలో నకిలీ పీఎఫ్ ఉందని గమనించి రిజెక్ట్ చేశారు. ఆ ఫేక్ కంపెనీ అకౌంట్‌ను క్లియర్ చేస్తే ఉద్యోగం వస్తుందని తెలుసుకున్న బాధితుడు ప్రేమ్ దృష్టికి తీసుకెళ్లాడు. అతడు నిర్లక్ష్యంగా వ్యవహరించడంతో విసుగు చెంది పోలీసులను ఆశ్రయించారు. బాధితుడి ఫిర్యాదుమేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్‌ఐ తెలిపారు.

మహిళ అదృశ్యంపై కేసు నమోదు



పున్నమ్మ

నాగారం, సెప్టెంబరు 22 (ఆంధ్రజ్యోతి): మహిళ అదృశ్యంపై కేసు నమోదు చేసినట్లు సూర్యాపేట జిల్లా నాగారం ఎస్‌ఐ అయిలయ్య తెలిపారు. తిరుమలగిరి గ్రామానికి చెందిన బోడ పున్నమ్మ(46) నాగారం మండలంలోని మామిడిపల్లి గ్రామంలోని కుమార్తె పేరాల మమత ఇంటికి ఈ నెల 1న వచ్చింది. మధ్యాహ్నం సూర్యాపేటకు వెళ్లి వస్తానని బయలుదేరి తిరిగి ఇంటికిరాలేదు. పున్నమ్మ కుమార్తె మమత నాగారం పోలీసుస్టేషన్‌లో సోమవారం ఫిర్యాదుచేశారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నామని ఎస్‌ఐ తెలిపారు. ఆచూకీ తెలిసిన వారు 8712686039, 8143262997 ఫోన్ నెంబర్లకు సమాచారం అందించాలన్నారు.

అరచేతిలో వ్యవసాయ సమాచారం

● రైతుల కోసం వాట్సాప్ చానల్



» రైతులకు సలహాలు, సూచనలు ఇస్తున్న శాస్త్రవేత్తలు
» ఆధునిక సాంకేతికత, వ్యవసాయ పరికరాల సమాచారం

మోత్కూరు, సెప్టెంబరు 22 (ఆంధ్రజ్యోతి): వ్యవసాయ రంగంలో వస్తున్న ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని రైతులకు నేరుగా చేరవేసేందుకు వ్యవసాయ శాఖ కమిషనరేట్ వాట్సాప్ చానల్‌ను అందుబాటులోకి తెచ్చింది. ఈ రోజుల్లో ఎక్కువ మంది రైతుల వద్ద ఆండ్రాయిడ్ సెల్‌ఫోన్లు ఉంటున్నాయి. రైతులు సంబంధిత వ్యవసాయ శాఖ విస్తరణాధికారులను (ఏఈవోలను) సంప్రదిస్తే వారు ఆ వాట్సాప్ ఛానల్‌లో చేర్చుతారు. దీంతో వ్యవసాయ రంగంలో కాలానుగుణంగా వస్తున్న మార్పులను, ఆధునిక సాంకేతిక పరిజ్ఞానానికి సంబంధించిన సమాచారం, కొత్త రకం పంటలను ఎప్పటికప్పుడు అందులో చేర్చి రైతులకు అందిస్తున్నారు. తక్కువ ఖర్చుతో అధిక దిగుబడి, అధిక ఆదాయం పొం దేందుకు సలహాలు, సూచనలు అందిస్తారు. పంటల దశను బట్టి, వాతావరణ పరిస్థితులను బట్టి తీసుకోవాల్సిన జాగ్రత్తలు, వాడాల్సిన ఎరువులు, క్రిమిసంహారక మందులు తదితర అంశాలపై వ్యవసాయ శాస్త్రవేత్తలు, వ్యవసాయ శాఖ అధికారులు అవగాహన కల్పిస్తారు. రైతులు అందులో చేరడానికి ఏఈవోలను సంప్రదిస్తే వారు లింక్ పంపుతారు. దాంతో అందులో చేరవచ్చు.

ఉమ్మడి నల్లగొండ జిల్లాలో వ్యవసాయ అధికారులు ఈ వాట్సాప్ ఛానల్‌ను లాగిన్ అయ్యారు. తొలుత ప్రతీ ఏఈవో ఈ యాప్‌ను 100మంది రైతుల సెల్‌ఫోన్లలో డౌన్‌లోడ్ చేయాలని అధికారులు ఆదేశించినట్టు సమాచారం.

ఛానల్‌లో అందనున్న సమాచారం

» ప్రభుత్వ పథకాలు, సబ్సిడీ వివరాలు
» పంటల సంరక్షణకు కాలానుగుణ సూచనలు, వాతావరణ హెచ్చరికలు, పంటల సస్యరక్షణకు మార్గదర్శకాలు
» మార్కెట్ ధరలు, శిక్షణ కార్యక్రమాలు
» రైతు నేస్తం కార్యక్రమాల షెడ్యూల్
» వీడియో కాన్ఫరెన్స్ ద్వారా రైతులతో నేరుగా సమావేశాలు

వాట్సాప్ చానల్ ఉపయోగకరంగా ఉంది



నేను వాట్సాప్ చానల్‌లో చేరాను. ఈ ఛానల్ చాలా ఉపయోగకరంగా ఉంది. ఏ భూమిలో ఏ పంట వేయాలి? పంటల అధిక దిగుబడికి, తెగుళ్లు సోకినప్పుడు సస్యరక్షణకు తీసుకోవాల్సి చర్యల గురించి తెలుసుకోవడాని కి వ్యవసాయ అధికారుల వద్దకు వెళ్లాల్సిన అవసరం లేకుండానే సెల్‌ఫోన్‌లో సమాచా రం అందుతోంది. వాట్సాప్ ఛానల్‌లో అధికారులు, వ్యవసాయ శాస్త్రవేత్తలు ఇస్తున్న సమచారం బాగానే ఉంటున్నప్పటికీ రైతులకు పంటలపై, ఆధునిక సాంకేతిక పరికరాల వినియోగంపై కలిగే సందేహాలను నివృత్తి చేసుకోవడానికి కూడా ఛానల్‌లో అవకాశం కల్పించాలి. -గోవర్ధన్‌రెడ్డి, సేంద్రియ రైతు, మోత్కూరు

రైతులకు మేలు



రాష్ట్ర ప్రభుత్వం రూపొందించిన వ్యవసాయ వాట్సాప్ ఛానల్ రైతులకు ఉపయోగకరంగా ఉంటుంది. మాటిమాటికీ అధికారుల వద్దకు వెళ్లనవసరం లేకుండా సెల్‌ఫోన్‌లో సమస్త సమాచారాన్ని తెలుసుకునేందుకు ఈ వాట్సాప్ ఛానల్‌ను రూపొందించారు. వివిధ పంటల్లో అధిక దిగుబడులు ఇచ్చే విత్తన రకాలు, పంటల పరిస్థితి, దానికి వాడాల్సిన ఎరువులు, క్రిమీసంహారక మందుల మోతాదు తెలుసుకు నే అవకాశం ఉంటుంది.

ఎరువులు, క్రిమి సంహారక మందులు అధికంగా వాడకుండా అధికారులు, శాస్త్రవేత్తలు తగు సూచనలు ఇస్తారు. అండ్రాయిడ్ సెల్ ఫోన్ ఉన్న ప్రతీ రైతు ఈ చానల్‌లో చేరాలి.

- వెంకటరమణారెడ్డి,జిల్లా వ్యవసాయ అధికారి

సైన్స్‌పై ఆసక్తి ... పెంపొందించేలా..

» కేంద్ర ప్రభుత్వం ఆధ్వర్యంలోవిద్యార్థులకు విజ్ఞాన్ మంథన్ పరీక్ష
» ప్రతిభ చూపిన వారికి ప్రోత్సాహకాలు » దరఖాస్తుకు ఈ నెల 31న ఆఖరు

విద్యార్థుల్లో దాగి ఉన్న ఆవిష్కరణలకు పదును పెట్టేలా పరిశోధనలు, ప్రయోగాల్లో రాణించేలా ప్రతి ఏడాది కేంద్ర ప్రభుత్వం విద్యార్థి విజ్ఞాన్ మంథన్ జాతీయ స్థాయి ప్రతిభ పరీక్షను నిర్వహిస్తుంది. అదే మాదిరిగా ఈ సంవత్సరం కూడా కేంద్ర ప్రభుత్వం శాస్త్ర సాంకేతిక సమాచార సంస్థ ఆధ్వర్యంలో, ఎన్‌సీఈఆర్‌టీ విజ్ఞాన్ ప్రసార్, విజ్ఞాన భారతి సంస్థ సంయుక్తంగా పరీక్ష నిర్వహిస్తుంది. ఇందులో ప్రతిభ కనపర్చిన విద్యార్థులకు నగదు ప్రోత్సాహకాలతో పాటు దేశంలోని ప్రముఖ పరిశోధన సంస్థల్లో ఇంటర్న్‌షిప్, స్కాలర్‌షిప్ లభించనుంది.

- (ఆంధ్రజ్యోతి-సూర్యాపేట అర్బన్)

సైన్స్‌పట్ల విద్యార్థులకు ఆసక్తి కలిగించడమే ఈ పరీక్ష విధానం లక్ష్యం. ఈ పరీక్షలు రెండు విభాగాల్లో ఉంటాయి. జూనియర్ విభాగంలో 6,7 తరగతుల విద్యార్థులు, సీనియర్ విభాగం లో 9,10, ఇంటర్ మొదటి సంవత్సరం విద్యార్థు లు పరీక్షకు హాజరుకావచ్చు. తెలుగు, హిందీ, ఇంగ్లిష్‌తో పాటు 14భాషల్లో ఆన్‌లైన్ పద్ధతిలో నిర్వహిస్తారు. విద్యార్థులు తమ ఆసక్తిని బట్టి భాషను నిర్ణయించుకోవచ్చు. ఇస్రో, డీఆర్‌డీవో, సీఎస్ఐఆర్, బీఏఆర్‌సీ, ఐఐఎస్ఈఈఆర్, ఐఐసీటీ, ఎన్ఐఎన్ వంటి జాతీయ పరిశోధన సంస్థల్లో ఇంటర్న్‌షిప్‌నకు అవకాశం ఉంది. అంతేకాకుండా పలు స్కాలర్‌షిప్‌లను అందజేస్తారు. పాఠశాల స్థాయిలో 18మందిని ఎంపిక చేస్తారు. ఒక్కో తరగతి నుంచి ముగ్గురు చొప్పున రాష్ట్ర స్థాయికి ఎంపిక చేస్తారు. రాష్ట్రస్థాయిలో విజేతలకు రూ.5వేలు, రూ.3వేలు, 2వేలు ఉపకారవేతనం, సర్టిఫికెట్, మెమెంటో అందజేస్తారు. జాతీయ స్థాయికి ఎంపికైన విద్యార్థుల్లో మొదటి బహుమతిగా రూ.26 వేలు, ద్వితీయ బహుమతిగా రూ.15వేలు, తృతీయ బహుమతిగా రూ.10వేలు అందజేస్తారు. దీంతో పాటు భాస్కర స్కాలర్‌షిప్ పేరుతో ఏడాది పాటు నెలకు రూ.2వేలు అందజేస్తారు.

దరఖాస్తు ఇలా..

విద్యార్థులు వీవీఎం అధికారిక వెబ్‌సైట్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలి. రూ.200 చెల్లించి ఈనెల 30వరకు దరఖాస్తు చేసుకోవచ్చు. పరీక్ష జరిగే రోజున విద్యార్థులు అందుబాటులో ఉన్న మొబైల్, ల్యాప్‌టాప్, డెస్క్‌టాప్ వంటి డిజిటల్ పరికరాల్లో ఏదైనా నుంచి నిర్దేశిత అప్లికేషన్‌ను డౌన్‌లోడ్ చేసుకోవాలి. అప్లికేషన్ ద్వారా పరీక్ష రాయాల్సి ఉంటుంది. విద్యార్థులు ఎక్కడి నుంచైనా పరీక్ష రాయవచ్చు. పరీక్ష సాధన కోసం వెబ్‌సైట్‌లో పుస్తకాలు అందుబాటులో ఉన్నాయి. లెవల్ -1కు సంబంధించిన పాఠశాల స్థాయి పరీక్షలు అక్టోబరు 28నుంచి 30వరకు, జిల్లా స్థాయి పరీక్ష నవంబరు 19న, జాతీయ స్థాయి పరీక్ష 2026 మే నెలలో ఉంటాయి.

తల్లిదండ్రులు విద్యార్థులను పరీక్షకు హాజరయ్యేలా చూడాలి..



విద్యార్థుల్లో సైన్స్ పట్ల ఆసక్తిని పెంచి నూతన ఆవిష్కరణల వైపు ప్రోత్సహించడానికి వీవీఎం పరీక్ష దో హదపడుతుంది. విద్యార్థులకు అవగాహన కల్పించి దరఖాస్తు చేసుకునే విధంగా ఉపాధ్యాయులు కృషి చేయాలి.

- పోతరాజు ఆనందం, వీవీఎం రాష్ట్ర కోఆర్డినేటర్

పేదల సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం



లబ్ధిదారులకు సీఎంఆర్ఎఫ్ చెక్కులను పంపిణీ చేస్తున్న ఎమ్మెల్సీ శంకర్‌నాయక్

మిర్యాలగూడ, సెప్టెంబరు 22(ఆంధ్రజ్యోతి): పేదల సంక్షేమానికి ప్రభుత్వం కట్టుబడి ఉందని ఎమ్మెల్సీ శంకర్‌నాయక్ అన్నారు. పలువురు లబ్ధిదారులకు మంజూరైన సీఎంఆర్ఎఫ్ చెక్కులను సోమవారం ఎమ్మెల్సీ కార్యాలయంలో పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అత్యవసర సమయాల్లో పేదలు కార్పొరేట్ స్థాయి వైద్యం పొందేందుకు ప్రభుత్వం సీఎం రిలీఫ్ ఫండ్ ద్వారా నిధులు సమకూరుస్తోందన్నారు. అర్హులైన పేదలు ఈ అవకాశాన్ని వినియోగించుకుని లబ్ధిపొందాలని అన్నారు. 10 మంది లబ్ధిదారులకు 7 లక్షల విలువైన చెక్కులను పంపిణీ చేశారు. కార్యక్రమంలో కాంగ్రెస్ కిసాన్ సెల్ జిల్లా అధ్యక్షుడు ముదిరెడ్డి నర్సిరెడ్డి, వేములపల్లి మండల అధ్యక్షుడు మాలి కాంతారెడ్డి, ఎస్సీ సెల్ మండల అధ్యక్షుడు కొమ్ము వెంకన్న, తంగెళ్ల సత్తిరెడ్డి, గౌరు రమేష్, బొంగర్ల వినోద్, పగడాల నగేశ్, బోరింగ్ సైదులు, పుల్లయ్య తదితరులు పాల్గొన్నారు.

బుద్ధవనంలో నేడు బతుకమ్మ సంబరాలు

నాగార్జునసాగర్, సెప్టెంబరు 22(ఆంధ్రజ్యోతి): నాగార్జున సాగర్ బుద్ధవనంలో మంగళవారం బతుకమ్మ సంబరాలను నిర్వహిస్తున్నట్టు బుద్ధవనం ప్రత్యేక అధికారి మల్లెపల్లి లక్ష్మయ్య సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. రాష్ట్ర వ్యాప్తంగా ఈనెల 21 నుంచి 30వ తేదీ వరకు జరుగుతున్న బతుకమ్మ సంబరాల్లో భాగంగా బుద్ధవనంలో బతుకమ్మ సంబరాలు నిర్వహిస్తున్నామని తెలిపారు. బతుకమ్మ సంబరాల్లో పాల్గొనే మహిళలకు నాగార్జునసాగర్ రెండు కాలనీల నుంచి బుద్ధవనానికి రవాణా సౌకర్యం ఏర్పాటు చేసినట్టు తెలిపారు. అంతే కాకుండా న్యాయ నిర్ణేతల నిర్ణయం మేరకు ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులను అందజేస్తామని తెలిపారు.

జీఎస్టీ తగ్గింపుతో రైతులకు ఊరట

(5వ పేజీ తరువాయి)

ఉన్నాయి. గత ప్రభుత్వ హయాంలో నాలుగేళ్లపాటు ఈ పథకాన్ని అమలులోకి తీసుకొచ్చినప్పటికీ ఆ తర్వాత ఆరేళ్లపాటు ఈ పథకాన్ని నిలిపివేశారు. తాజాగా కాంగ్రెస్ ప్రభుత్వం పథకాన్ని అమలు చేస్తుంది.

వచ్చే నెల 15లోగా అమలు..

మండలస్థాయిలో త్రీమెన్ కమిటీలు చేసిన తీర్మానాలను ఆధారంగా చేసుకొని జిల్లా స్థాయి కమిటీలు తుది జాబితాను మూడు జిల్లాల కలెక్టర్లకు అందజేస్తారు. 2025-26 ఆర్థిక సంవత్సరానికి యాంత్రీకరణ పథకం అమలుకోసం రాష్ట్ర ప్రభుత్వం ఉమ్మడి జిల్లాకు రూ.6.18కోట్లను కేటాయించింది. ఇందులో నల్లగొండ జి ల్లాకు రూ.3.14కోట్లు, సూర్యాపేట జిల్లాకు రూ. 1.84కోట్లు, యాదాద్రి భువనగిరి జిల్లాకు రూ.1.24కోట్లను మంజూరుచేసింది. కేంద్ర ప్రభుత్వం 60శాతం నిధులను, రాష్ట్ర ప్రభుత్వం 40 శాతం నిధులతో ఈ పథకాన్ని అమలు చేస్తున్నాయి. ఎస్సీ, ఎస్టీ, బీసీలతో పాటు మహిళా రైతులకు 50శాతం సబ్సిడీ ఇవ్వనుండగా జనరల్ కేటగిరీ రైతులకు 40శాతం సబ్సిడీ వర్తింపజేస్తారు. వచ్చే నెల 15లోగా దరఖాస్తుల ప్రక్రియను పూర్తి చేయడం, ఆ లోగానే పరికరాలు సైతం పంపిణీ చేయడానికి వ్యవసాయ శాఖ అధికారులు కసరత్తు చేస్తున్నారు. యాంత్రీకరణ పథకాన్ని పూర్తిస్థాయిలో అమలు చేయడమే కాకుండా ఆ పరికరాలను ఏ విధంగా ఉపయోగించాలనే దానిపై రైతులకు అవగాహన కల్పించనున్నారు. డ్రోన్ల వినియోగం గురించి, ఇతర పరికరాల గురించి ప్రదర్శనలు నిర్వహించనున్నట్లు తెలుస్తుంది. వచ్చే యాసంగి సీజన్‌లో ఈ పరికరాలను ఉపయోగించేలా రైతులకు అందుబాటులోకి తీసుకురానున్నారు. అయితే ఈసారి మాత్రం ట్రాక్టర్లను ఈ పథకంలో వర్తింపచేయడంలేదు.

మండల కమిటీల తీర్మానాలను సేకరిస్తున్నాం

వ్యవసాయ యాంత్రీకరణ పథకం అమలుకోసం ప్రభుత్వం ఆదేశాల మేరకు మండలస్థాయిలోని త్రీమెన్ కమిటీల నుంచి తీర్మానాలు సేకరిస్తున్నాం. అర్హులైన రైతులకు మాత్రమే సబ్సిడీ పరికరాలు అందేలా కమిటీల నుంచి పూర్తిస్థాయి నివేదికలను తీసుకుంటున్నాం. జిల్లాస్థాయిలో శాస్త్రవేత్తలతో కలిసి తుదిజాబితాను రూపొందించి కలెక్టర్‌కు అందజేస్తాం. వచ్చేనెల 15 లోగా పథకాన్ని గ్రౌండింగ్ చేయాలని నిర్ణయించాం.

పి.శ్రవణ్ కుమార్, జేడీఏ నల్లగొండ

మట్టపల్లిలో పవిత్రోత్సవాలు పరిపూర్ణం



పూర్ణాహుతి నిర్వహిస్తున్న వేదపండితులు

మఠంపల్లి, సెప్టెంబరు 22(ఆంధ్రజ్యోతి): మట్టపల్లి లక్ష్మీనరసింహస్వామి మహాక్షేత్రంలో నాలుగు రోజులుగా నిర్వహిస్తున్న పవిత్రోత్సవాలు సోమవారం పూర్ణాహుతితో ముగిశాయి. ఈ సందర్భంగా వేదపండితులు పుణ్యాజలాలతో స్వామికి, జీవధ్వజానికి సంప్రోక్షణ చేశారు. సర్వనది తీర్థాలతో అభిషేకాలు క్రతువులు ముగించి శాంతి కల్యాణం నిర్వహించారు. ఖమ్మం జిల్లా వాసులు బీవీ వాసుదేవాచార్యులు నేతృత్వంలో జరిగిన కార్యక్రమాల్లో ఆలయ ధర్మకర్తలు చెన్నూరి మట్టపల్లిరావు, విజయ్‌కుమార్, ఈవో సిరికొండనవీన్, అర్చకులు టి.శ్రీనివాసచార్యులు, టి.కృష్ణమాచార్యులు, టి.రామాచార్యులు, పద్మనాభాచార్యులు, ఫణిభూషణమంగాచార్యులు, బ్రహ్మాచార్యులు, బదరీనారాయణ చార్యులు పాల్గొన్నారు.

34 రోజుల్లో రూ.2 కోట్ల హుండీ ఆదాయం

● యాదగిరిగుట్టలో కానుకల లెక్కింపు



హుండీ కానుకలు లెక్కిస్తున్న సిబ్బంది

యాదగిరిగుట్ట, సెప్టెంబరు 22 (ఆంధ్రజ్యోతి): యాదగిరిగుట్ట లక్ష్మీ నరసింహస్వామి ఆలయ ఖజానాకు 34రోజుల్లో రూ.2కోట్ల హుండీ ఆదాయం సమకూరింది. ఆగస్టు 19వ తేదీ నుంచి ఈ నెల 21వరకు లక్ష్మీనృసింహుడిని దర్శించుకున్న భక్తులు సమ ర్పించిన కానుకలను సోమవారం లెక్కించారు. రూ.2,00,83,825 నగదుతోపాటు 65.500 గ్రాముల మిశ్రమ బంగారం, 2.800 కిలోల మిశ్రమ వెండి సమకూరింది. వీటికితోడు 540 అమెరికా 540 డాలర్లు, 95 ఇంగ్లండ్ పౌండ్లు, 6 సౌదీ అరేబియా రియల్, 401 ఒమన్ రియాల్, 40మలేషియా రింగ్గిట్లు, 5 యూరో యూరోలు, 155 యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్ ధీరమ్, 70 కెనడా డాలర్లు, 250 ఇరాక్ దినార్లు కానుకల రూపంలో విదేశాల కరెన్సీ సమకూరినట్లు ఈవో ఎస్.వెంకట్రావు తెలిపారు. కొండ కింద వ్రత మండపంలో ఆలయ ఈవో ఎస్. వెంకట్రావు, అనువంశిక ధర్మకర్త భాస్కరాయణి నరసింహమూర్తి పర్యవేక్షణలో లెక్కింపు ప్రక్రియ కొనసాగింది.

శివాలయంలో దేవీ శరన్నవరాత్రోత్సవాలు

యాదగిరిగుట్ట లక్ష్మీనరసింహ స్వామివారి దేవస్థానం శివాలయంలో సోమవారం దేవీ శరన్నవరాత్రోత్సవాలు వైభవంగా ప్రారంభమయ్యాయి. ఆలయంలో ఉదయం 11.45 గంటలకు విఘ్నేశ్వర పూజ నిర్వహించి స్వస్తివాచనం, రుత్విగ్వరణం, అఖండ దీపారాధన, కలశ స్థాపన వేద మంత్ర పఠనాలు, ఆస్థాన విద్వాంసుల మంగళవాయిద్యాలతో జరిపారు. శ్రీదేవి, బాల త్రిపుర సుందరీ మూలమంత్ర జపాలు, సప్తశతీ, లలిత పారాయణాలు ప్రధానార్చకబృందం నిర్వహించారు. సాయంత్రం 6.30 గంటలకు నవావరణ, చతుష్షష్ట్యుపచారయుక్త సహస్రనామార్చన, నీరాజన మంత్ర పుష్పం, తీర్థ ప్రసాద వితరణ చేసి దేవి త్రికాల పూజలు అర్చకులు చేపట్టారు. వేడుకల్లో ఆలయ అనువంశిక ధర్మకర్త భాస్కరాయణీ నరసింహమూర్తి దంపతులు, ఈవో ఎస్. వెంకట్రావు, అర్చకులు పాల్గొన్నారు.

కోదాడలో కోడిపిల్ల బొరిగకు శస్త్రచికిత్స

కోదాడ రూరల్, సెప్టెంబరు22 (ఆంధ్రజ్యోతి): సూర్యాపేట జిల్లా కోదాడలో కోడిపిల్లకు బొరిగ (స్వరపేటిక)కు అరుదైన శస్త్రచికిత్స చేసినట్లు ప్రాంతీయ పశువైద్యశాల అసిస్టెంట్ డైరెక్టర్ పి.పెంటయ్య తెలిపారు. కోదాడ పట్టణానికి చెందిన జి.రవికుమార్ ఇంటివద్ద కోళ్లను పెంచుతుండగా, కుక్కల దాడిలో కోడిపిల్లకు బొరిగ పగిలి రక్తం కారుతూ ఇంటికి వచ్చింది. వెంటనే యజమాని కోడిపిల్లను ప్రాంతీయ పశువైద్యశాలకు తీసుకురాగా కోడిపిల్లకు శస్త్ర చికిత్స చేసి బొరిగను కుట్ల ద్వారా అతికించారు. చికిత్స అనంతరం కోడిపిల్లను చూసి యజమాని సంతోషం వ్యక్తం చేశారు సిబ్బంది చంద్రకళ, అఖిల్ పాల్గొన్నారు.

నూనెగింజల సాగుతో అధిక లాభాలు



సమావేశంలో మాట్లాడుతున్న కేవీకే శాస్త్రవేత్త నరేష్

ఆత్మకూర్(ఎస్), సెప్టెంబరు 22 (ఆంధ్రజ్యోతి) : రైతులు పంట మార్పిడి చేపట్టి నూనె గింజల సాగు చేయడంతో అధిక లాభాలు పొందవచ్చని కేవీకే గడ్డిపల్లి వ్యవసాయ శాస్త్రవేత్త నరేష్ అన్నారు. సూర్యాపేట జిల్లా ఆత్మకూర్(ఎస్) మండలం తుమ్మలపెన్‌పహాడ్ గ్రామంలో అరవింద కృషి విజ్ఞాన కేంద్రం(గడ్డిపల్లి) ఆధ్వర్యంలో జాతీయ ఆహార భద్రత పథకంలో భాగంగా నూనెగింజలు, వేరుశనగ పంటల సాగుపై రైతులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా వేరుశనగ సాగు చేస్తున్న రైతులకు జిగురు అట్టలు, వేపనూనె, సోలార్ దీపాలు, ఎరువులు పంపిణీ చేశారు. వేరుశనగ పంట సాగువిధానం, యాజమాన్య పద్ధతులపై రైతులకు అవగాహన కల్పించారు. వేరుశనగలో కలుపు నివారణ, నీటి యాజమాన్య పద్ధతులను రైతులకు వివరించారు. కేవీకే గడ్డిపల్లి వ్యవసాయ శాస్త్రవేత్తలు కిరణ్, సంతోష్ మాట్లాడుతూ.. వేరుశనగ పంటలకు జిప్సం ప్రాముఖ్య చాలా ఉంటుందన్నారు. అనంతరం వివిధ పంటలను క్షేత్రస్థాయిలో పర్యటించి, పరిశీలించారు. కార్యక్రమంలో వెంకట్‌రెడ్డి, చంద్రయ్య, శ్రవణయ్య, క్రాంతి, వెంకన్న తదితరులు పాల్గొన్నారు.

ఆలేరులో వాగుల వద్ద వరద ఉధృతి

● ఆలేరు-మంతపురి నిలిచిపోయిన రాకపోకలు



ఆలేరు-మంతపురి గ్రామాల మధ్యన ఉన్న లోలెవల్ బ్రిడ్జి వద్ద ఏర్పాటు చేసిన హెచ్చరిక బోర్డు

ఆలేరు, సెప్టెంబరు 22 (ఆంధ్రజ్యోతి) : యాదాద్రి భువనగిరి జిల్లా ఆలేరు పరిసర ప్రాంతాల్లో రెండు రోజులుగా కురుస్తున్న వర్షాలతో లోలెవల్ బ్రిడ్జిపై వాగులు వరద నీటితో ఉధృతంగా ప్రవహిస్తున్నాయి. దీంతో ఆయా గ్రామాలకు వెళ్లే ప్రజలకు రాకపోకలు నిలిచిపోయాయి. ఆలేరు-మంతపురి గ్రామాల మధ్య ఉన్న ఈదులవాగు బహదూర్‌పేట వాగులు వంగి ప్రవహిస్తుండడంతో గ్రామాలకు వెళ్లే ప్రజలకు ఇబ్బందులు ఏర్పడ్డాయి. దీంతో స్థానిక మునిసిపల్ కమిషనర్ శ్రీనివాస్ మేనేజర్ జగన్మోహన్ వాగుల వద్ద ప్రజలకు హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేశారు. వాగులు ప్రమాదకరంగా ప్రవహిస్తున్నాయని ప్రయాణికులు ప్రత్యామ్నాయ మార్గం ద్వారా గమ్యాలకు చేరుకోవాలని కోరుతూ హెచ్చరిక బోర్డులో తెలిపారు. కురుస్తున్న వర్షాలు పట్ల ప్రజలు జాగ్రత్తగా ఉండాలని లోతట్టు ప్రాంతాల ప్రజలు ఎగువ ప్రాంతంలో ఉన్న ప్రభుత్వ కార్యాలయాలు కమ్యూనిటీ హాల్‌లు పాఠశాలలోకి తరలి వెళ్లాలని కూలిపోయే ప్రమాదం ఉన్న ఇళ్ల నుంచి ఖాళీ చేసి ఎగువ ప్రాంతాలకు వెళ్ళాలని సూచించారు. ఏదైనా ప్రమాద పరిస్థితి ఏర్పడితే సెల్ నంబర్ 9849292771ను సంప్రదించాలని సూచించారు.

ఓజీ సినిమా టికెట్ రూ.1.30 లక్షలు

● వేలంలో దక్కించుకున్న అభిమాని ● మొదటి టికెట్‌కు చౌటుప్పల్‌లో వేలం



సినిమా టికెట్‌తో పాటు మెమొంటోను పవన్ కళ్యాణ్ అభిమాని పరమేష్‌కు అందజేస్తున్న జబర్దస్త్ ఆర్టిస్ట్ వినోద్

చౌటుప్పల్ టౌన్, సెప్టెంబరు 22 (ఆంధ్రజ్యోతి): ఏపీ రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి, పవన్‌కల్యాణ్ నటించిన ఈ నెల 25వ తేదీన విడుదల కానున్న 'ఓజీ' సినిమా మొదటి టికెట్ రూ.1.30లక్షలు పలికింది. ఆదివారం యాదాద్రి భువనగిరి జిల్లా చౌటుప్పల్ శ్రీనివాస్ థియేటర్‌లో నిర్వహించిన వేలంపాటలో ఆయన అభిమాని ఆముదాల పరమేష్ రూ.1.30 లక్షలకు టికెట్ దక్కించుకున్నారు. ఒక టికెట్‌కు నిర్వహించిన వేలంలో 100మంది పాల్గొనగా రూ.1.30లక్షలకు వేలం పాడిన పరమేష్‌కు జబర్దస్త్ ఆర్టిస్ట్ వినోద్ (మహిళా వేషధారిణి) టికెట్ అందజేశారు. అనంతరం 'ఓజీ' సినిమా పోస్టర్‌ను ఆవిష్కరించారు. వేలంతో వచ్చిన నగదును జనసేన పార్టీ ఫండ్‌కు అందజేయనున్నట్లు వేలంపాట నిర్వాహకులు, జనసేన చౌటుప్పల్ మండల అధ్యక్షుడు పర్నె శివారెడ్డి, నాయకులు, నందకిషోర్, టి.లింగస్వామి తెలిపారు.

నల్లగొండ ఆర్డీవో అశోక్ రెడ్డికి సీపీవోగా బాధ్యతలు

● ఉత్తర్వులు జారీ చేసిన ప్రభుత్వం

నల్లగొండ, సెప్టెంబరు 22 (ఆంధ్రజ్యోతి):నల్లగొండ ఆర్డీవో, ఇన్‌చార్జి డీఆర్‌వో వై. అశోక్ రెడ్డికి సీపీవోగా ఎఫ్ఏసీ ప్రాతిపదికన బాధ్యతలు అప్పగిస్తూ రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. గత నెల 31న సీపీవో సుబ్బారావు పదవీ విరమణ చేయడంతో సూర్యాపేట అసిస్టెంట్ డైరెక్టర్, సీపీవో ఎల్.కిషన్‌కు నల్లగొండ సీపీవోగా బాధ్యతలు ఇచ్చారు. అయితే సూర్యాపేట జిల్లాలో ఆయ న నిరంతరం బాధ్యతలు నిర్వహించాల్సి ఉండడంతో నల్లగొండ సీపీవోగా అదనపు బాధ్యతల వల్ల కార్యకలాపాలకు ఇబ్బందులు తలెత్తిన నేపథ్యంలో ఆర్డీవో అశోకొరెడ్డి బాధ్యతలను అప్పగిస్తూ ఉత్తర్వులు ఇచ్చింది. తదుపరి ఉత్తర్వులు వచ్చే వరకు ఛీఫ్ ప్లానింగ్ ఆఫీసర్‌గా అశోక్ రెడ్డి కొనసాగనున్నారు. ఈ నేపథ్యంలో సూర్యాపేట సీపీవో కిషన్ నల్లగొండ సీపీవో బాధ్యతల నుంచి సోమవారం రిలీవ్ అయ్యారు.

'2013 భూసేకరణ చట్టం ప్రకారం పరిహారమివ్వాలి'

మర్రిగూడ, సెప్టెంబరు 22 (ఆంధ్రజ్యోతి): రీజినల్ రింగ్ రోడ్డులో భూములు కోల్పోతున్న రైతులకు 2013 భూసేకరణ చట్టం ప్రకారం నష్ట పరిహారం అందించాలని సీపీఎం నల్లగొండ జిల్లా కార్యదర్శి తుమ్మల వీరారెడ్డి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. నల్లగొండ జిల్లా మర్రిగూడ మండలంలోని బట్లపల్లి, వట్టిపల్లి గ్రామాలకు చెందిన రైతుల వ్యవసాయ భూములు రింగ్ రోడ్డు పోతున్నందున అక్కడ రైతుల భూ ములను పరిశీలించారు. వారితో మాట్లాడి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. రీజినల్ రింగ్ రోడ్డు నిర్మాణం కోసం తీసుకున్న నిర్ణయం వల్ల రైతులు తీవ్రంగా నష్టపోతున్నారన్నారు. భూములు కోల్పోతున్న రైతులకు భూమికి భూమి, లేదా మూడు వంతుల నష్టపరిహారం చెల్లించడమే కాకుండా ప్రతి ఇంటికి ఉద్యోగం వారికి ఉపాధి కల్పించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు బండ శ్రీశైలం, ఐలయ్య, నాయకులు ఏర్పుల యాదయ్య, సల్వోజు రామలింగచారి, రైతులు యాదయ్య, చిన్నయ్య, లక్ష్మయ్య, అంజయ్య పాల్గొన్నారు.

భక్తులకు సులభతర సేవలు : ఈవో వెంకట్రావు

● యాదగిరికొండపై అందుబాటులోకి కియోస్క్ యంత్రాలు



స్వయం బుకింగ్ కియోస్క్ స్క్రీన్‌పై ఆపరేటింగ్ చేస్తున్న ఈవో వెంకట్రావు

యాదగిరిగుట్ట, సెప్టెంబరు 22(ఆంధ్రజ్యోతి): యాదగిరిగుట్ట లక్ష్మీనరసింహులను దర్శించుకునేందుకు తరలివచ్చే భక్తులకు సులభతరమైన సేవలు అందించేందుకు నగదు రహిత సేవలు అందుబాటులోకి వచ్చాయని ఈవో ఎస్.వెంకట్రావు చెప్పారు. యాదగిరికొండపై సోమవారం స్వయం బుకింగ్ కియోస్క్ యంత్రాలను ప్రారంభించి మాట్లాడారు. కొత్తగా ప్రవేశపెట్టిన యంత్రాలతో భక్తులకు మరింత మెరుగైన సేవలు పొందొచ్చన్నారు. దర్శన టికెట్లు, ఆర్జిత సేవలు, ప్రసాదాల కూపన్లు పొందడం, విరాళాలు, హుండీల్లో కానుకలు సమర్పించడం, ఆలయ సమాచారంతో పాటు ఇతర సౌకర్యాలు, పూజల వేళలు, టికెట్లు సులభతరంగా పొందొచ్చన్నారు. భక్తులు స్క్రీన్‌పై టచ్ చేస్తే సులభంగా సేవలు పొందొచ్చన్నారు. వీటి వల్ల క్యూలో నిలబడేందుకు సమయం ఆదా, పారదర్శకం, వేగంగా నగదు రహిత (క్రెడిట్, డెబిట్) సేవలు వినియోగించుకోవచ్చన్నారు. భక్తుల సౌకర్యార్థం ఆలయ ఈ శాన్య దిక్కులోని అఖండ దీపారాధన ప్రాంగణంలో 3, విరాళాల విభాగం 1, కొండకింద వ్రత మండపంలో 1, అద్దె గదుల విభాగం 1 ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో ఆలయ అనువంశిక ధర్మకర్త భాస్కరాయణీ నరసింహమూర్తి, డీఈవో దోర్బల భాస్కరశర్మ, ప్రధానార్చకుడు కాండూరి వెంకటాచార్యులు, మంగళగిరి నరసింహమూర్తి, కిరణాచార్యులు పాల్గొన్నారు. అనంతరం కొండపై యాదగిరి మాస పత్రిక కార్యాలయాన్ని ఈవో వెంకట్రావు అనువంశిక ధర్మకర్త భాస్కరాయణి నరసింహమూర్తితో కలిసి ప్రారంభించారు.

విశ్రాంత ఉద్యోగుల సంఘం నూతన కార్యవర్గం ఎన్నిక రేపు

మోత్కూరు, సెప్టెంబరు 22 (ఆంధ్రజ్యోతి): విశ్రాంత ప్రభుత్వ ఉద్యోగుల సంఘం మోత్కూరు తాలూకా యూనిట్ నూతన కార్యవర్గాన్ని ఈ నెల 24న ఉదయం 10 గంటలకు సంఘ కార్యాలయంలో నిర్వహించే సమావేశంలో ఎన్నుకోనున్నామని ఆ సంఘం అధ్యక్ష, కార్యదర్శులు బద్దం యాదిరెడ్డి, ఆకవరం వల్లభాయ్ ఒకప్రకటనలో తెలిపారు. నూతన కార్యవర్గం 2025 నుంచి 2028 (3 ఏళ్లు) వరకు ఉంటుందని, సభ్యులందరూ సకాలంలో సమావేశానికి హాజరు కావాలని వారు కోరారు.

'ప్రతీ మహిళకు బతుకమ్మ చీర ఇవ్వాలి'

మోత్కూరు, సెప్టెంబరు 22 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం మహిళా సంఘాల సభ్యులకే బతుకమ్మ చీరలు ఇస్తామనడం సరికాదని, తెల్ల రేషన్‌కార్డు కలిగిన ప్రతిమహిళకు బతుకమ్మ చీరలు ఇవ్వాలని మహిళా సంఘం జిల్లా కమిటీ సభ్యురాలు కొంపల్లి ముత్తమ్మ డిమాండ్ చేశారు. సోమవారం మోత్కూరులో ఆమె విలేకరులతో మాట్లాడారు. తాము అధికారంలోకి వస్తే ప్రతీ మహిళకు రెండు నాణ్యమైన చీరలు ఇస్తానన్న ప్రభుత్వ హామీని అమలు చేయాలన్నారు.

చెరువు వద్ద కనిపించని హెచ్చరిక బోర్డులు



ప్రమాదమని తెలిసినా చేపల వేట చేస్తున్న విద్యార్థులు

● నీటి మాటున పొంచి ఉన్న గోతులు

బీబీనగర్, సెప్టెంబరు 22(ఆంధ్రజ్యోతి): బీబీనగర్ పెద్ద చెరువు పూర్తిస్థాయి నిండి జలకళను సంతరించుకుంది. అదే మాటున ఆదమరిస్తే ప్రాణాలు తీసేంత ప్రమాదకారిగా మారింది. సరదా కోసం ఈత కొట్టేందుకు చెరువులోకి దిగిన ఎంతో మంది యువకులను తనలో కలిపేసుకుని ప్రాణాలు తీస్తున్న సంఘటనలు ఎన్నో ఉన్నాయి. అలాంటప్పుడు ప్రమాదాలు జరగకుండా జాగ్రత్తలు తీసుకోవాల్సిన అధికారులు పట్టనట్లుగా వ్యవహరిస్తున్నారు. ఇటీవల కురిసిన భారీ వర్షాలకు ఎగువ నుంచి వరద నీరు వచ్చి చేరడంతో పూర్తిగా నిండుకుని అలుగుపోస్తోంది. అయితే చెరువు లోపల లోతైన గోతులు నీటి మాటున ప్రమాదకరంగా మారాయి. ఎవ్వరైన తెలియక నీటిలోకి దిగితే గోతుల్లోకి జారిపోయి ప్రాణాలు పోగొట్టుకునే ప్రమాదం పొంచి ఉంది. చెరువులు నిండి రోజులు గడుస్తున్న గోతులు మాటువేసి ఉన్న ప్రదేశాలను డేంజర్ జోన్‌గా గుర్తించి ప్రమాద హెచ్చరికలు ఏర్పాటు చేయాల్సి ఉంది. అయితే అధికారుల తప్పిదాలు అలసత్వం కారణంగా ఏటేటా యువకులు నీట మునిగి ప్రాణాలు పోగొట్టుకుంటు తల్లిదండ్రులకు పుత్రశోకాన్ని మిగిలిస్తున్నారు. గడిచిన 8ఏళ్లలో 17మంది ప్రాణాలు నీటిలో కలిసిపోయాయి.

సరదా కోసం ఈతకు వెళ్లి..

హైదరాబాద్-వరంగల్ 163 జాతీయ రహదారిని ఆనుకుని 70ఎకరాలకు పైగా విస్తరించి ఉన్న బీబీనగర్ పెద్ద చెరువు ఇటీవల కురిసిన వర్షాలకు జలకళ ఒట్టిపడుతుంది. ఈ మార్గంలో రాకపోకలు కొనసాగించే వాహనాదారులు చెరువు అందాలను తిలకించేందుకు కాసేపు ఆగి సేద తీరుతారు. మరికొందరు సరదాగా ఈత కొట్టేందుకు ఇంకొందరు స్నానం చేసేందుకు ఆసక్తి చూపుతారు. ఈ నేపథ్యంలోనే చెరువులోకి దిగి చెరువు అడుగు భాగంలో నీటి అంచున మాటు వేసి ఉన్న లోతైన గోతుల్లోకి ప్రమాదవశాత్తు జారిపోయి ప్రాణాలు పోగొట్టుకుంటున్న సంఘటనలు ఎక్కువగా ఉన్నాయి.

ప్రమాదం అంచున చేపల వేట..

ప్రస్తుత్తం చెరువు పూర్తిగా నిండి జాతీయ రహదారిని నీటి అలలు తాకుతుండడంతో చేపల కోసం యువత ఎగబడుతున్నారు. స్థానికులే కాకుండా ఇతర ప్రాంతాలకు చెందిన వాళ్లు రోడ్డు వెంటవెళ్లే వాహనాదారులు చేపలను వేటాడేందుకు గాలలతో చెరువు వద్దకు చేరుతున్నారు. పదేళ్ల బాలుడి నుంచి పెద్ద వారి వరకు ఉదయం నుంచి సాయంత్రం వరకు చెరువు నీటి అంచున నిలబడి గాలాలు వేస్తు చేపలు పట్టేందుకు పోటీ పడుతున్నారు. పొరపాటున ప్రమాదవశాత్తు చెరువులోకి జారిపడితే నీట మునిగి ప్రాణాలు పోయే ప్రమాదం ఉంది. అధికారులు ప్రమాదాలను ముందుగానే గుర్తించి నివారణ చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేయాలి



పెద్ద చెరువు వద్ద యువత ప్రమాదాల బారిన పడి ప్రాణాలు పోగొట్టుకోకుండా అధికారులు ముందస్తు చర్యలు తీసుకోవాలి. ముఖ్యంగా చెరువులో గోతులు ఎక్కువగా ఉన్న ప్రదేశాలను గుర్తించి యువకులు ఎవ్వరు చెరువులోకి దిగకుండా అక్కడ హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేయాలి. చెరువులోకి యువకులు వెళ్లకుండా ఇనుప కంచె ఏర్పాటు చేయాలి.

-ఉప్పలంచి శ్రీకాంత్, బీబీనగర్

సంక్షేమ బతుకమ్మ పాట విడుదల



అభినయ శ్రీనివాస్ రాసిన సంక్షేమ బతుకమ్మ పాట సీడీని ఆవిష్కరిస్తున్న ఉప ముఖ్యమంత్రి బట్టి విక్రమార్క, మంత్రులు

మోత్కూరు, సెప్టెంబరు 22 (ఆంధ్రజ్యోతి): మోత్కూరు మునిసిపల్ కేంద్రానికి చెందిన గేయ రచయిత అబినయ శ్రీనివాస్ రచించిన సంక్షేమ బతుకమ్మ పాటను ఆదివారం రాత్రి ఉప ముఖ్యమంత్రి బట్టి విక్రమార్క, వరంగల్ వేయి స్తంభాల గుడిలో ఆవిష్కరించారు. ఆ పాటలో శ్రీనివాస్ రాష్ట్ర ప్రభుత్వ సంక్షేమ పథకాలను వివరించారు. కార్యక్రమంలో మంత్రులు పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, కొండా సురేఖ, సీతక్క, జూపల్లి కృష్ణారావు, తెలంగాణ సాంస్కృతిక సారధి ఛైర్మన్ వెన్నెల గద్దర్ పాల్గొన్నారు.

కన్నయ్యకు మదర్ థెరిస్సా జాతీయ సేవా పురస్కారం

మోత్కూరు, సెప్టెంబరు 22 (ఆంధ్రజ్యోతి): వసుంధర విజ్ఞాన మండలి వైద్యుల గ్లోబల్ ఫౌండేషన్ సోమవారం హైద్రాబాదు రవీంద్రభారతిలో నిర్వహించిన ఓ కార్యక్రమంలో మోత్కూరు మునిసిపాలిటీ కేంద్రానికి చెందిన పోచం కన్నయ్యకు మదర్ థెరిస్సా జాతీయ సేవా పురస్కారం ప్రదానం చేశారు. పద్మశాలి సంఘం నాయకుడైన కన్నయ్య పలు సామాజిక సేవా కార్యక్రమాలు చేసినందుకుగా ఈ పురస్కారం ఇచ్చినట్టు నిర్వాహకులు తెలిపారు. రామగుండం మాజీ ఎమ్మెల్యే కోరుకంటి చందర్, తెలంగాణ భాషా సాంస్కృతిక శాఖ డైరెక్టర్ ఏనుగు నర్సింహారెడ్డి, తెలంగాణ సాహిత్య అకాడమి కార్యదర్శి నామోజు బాలాచారి చేతుల మీదుగా కన్నయ్య ఈ పురస్కారం అందుకున్నారు. వైద్యుల మధుకర్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో గూడూరు స్వామిరెడ్డి, కోట్ల విష్ వెంకటేశ్వర్‌రెడ్డి, కవి యాకూబ్, రమాదేవి పాల్గొన్నారు.

ప్రజల సమస్యల పరిష్కారానికి కృషి చేసిన అంజిరెడ్డి



అంజిరెడ్డి చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న జడ్పీ మాజీ ఛైర్మన్ సందీప్‌రెడ్డి

చౌటుప్పల్ టౌన్, సెప్టెంబరు 22 (ఆంధ్రజ్యోతి): పేద ప్రజల సమస్యల పరిష్కారానికి అంజిరెడ్డి తన వంతు కృషి చేశారని జడ్పీ మాజీ ఛైర్మన్ ఎలిమినేటి సందీప్‌రెడ్డి అన్నారు. చౌటుప్పల్ మండలం పంతంగి గ్రామంలో ఇటీవల మృతి చెందిన కాంగ్రెస్ నాయకుడు చీరిక అంజిరెడ్డి సంతాప సభను సోమవారం నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పలువురు పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో ఏఎంసీ ఛైర్మన్ ఉబ్బు వెంకటయ్య, కాంగ్రెస్ మునుగోడు అసెంబ్లీ కో-ఆర్డినేటర్ పబ్బు రాజు గౌడ్, మాజీ ఎంపీపీ చిల్కూరీ ప్రభాకర్ రెడ్డి, ఏఎంసీ వైస్ ఛైర్మన్ ఆకుల ఇంద్రసేనా రెడ్డి, సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు బూరుగు కృష్ణారెడ్డి పాల్గొన్నారు.

కుక్కల బెడదను నివారించాలి

ఆలేరు, సెప్టెంబరు 22 (ఆంధ్రజ్యోతి): మండలంలోని సాయిగూడెంలో విపరీతంగా ఉన్న కుక్కల బెడదను నివారించాలని గ్రామస్థులు కోరారు. సోమవారం ఈమేరకు గ్రామపంచాయతీ కార్యదర్శి పానుగంటి ప్రత్యూషకు వినతి పత్రం అందజేశారు. గ్రామంలోని అన్ని వీధుల్లో కుక్కలు విపరీతంగా ఉన్నాయని, అవి దారిన పోయే ప్రజలపై దాడి చేసి గాయపరుస్తున్నాయని తెలిపారు. వినతిపత్రం అందజేసిన వారిలో గ్రామస్తులు ఐలయ్య, మైల లక్ష్మయ్య, భీమగాని నర్సింహులు, నల్లమాస కృష్ణ, కొండ చంద్రారెడ్డి, సుధీర్‌కుమార్, రమేష్, సురేష్, చింతకాయల నగేష్ ఉన్నారు.

ఎన్నికల హామీని అమలు చేయాలి

ఆలేరు, సెప్టెంబరు 22 (ఆంధ్రజ్యోతి): గత అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ ప్రజలకు ఇచ్చిన ఆరు గ్యారెంటీల స్కీమ్ హామీని వెంటనే అమలు చేయాలని సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు చెక్క వెంకటేష్ డిమాండ్ చేశారు. సోమవారం స్థానిక సీపీఐ కార్యాలయంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. అర్హులైన పేదలందరికీ ఇంళ్ల స్థలాలు, ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేయాలని కోరారు. సమావేశంలో పార్టీ మండల కార్యదర్శి చౌడబోయిన కనకయ్య, నాయకులు రవి, పోతు ప్రవీణ్ పాల్గొన్నారు.

కుమ్మర్లను ప్రభుత్వం ఆదుకోవాలి

ఆలేరు, సెప్టెంబరు 22 (ఆంధ్రజ్యోతి): కుల వృత్తితో జీవనం సాగిస్తూ, ఆర్థికంగా రాజకీయంగా వెనుకబడిన కుమ్మర్లను ప్రభుత్వం అన్ని విధాలా ఆదుకోవాలని కుమ్మర సంఘం మండల కన్వీనర్ గంగధారి సుధీర్‌కుమార్ కో కన్వీనర్ కొరుటూరు ఉపేందర్ కోరారు. సోమవారం మండలంలోని కొలనుపాకలో జరిగిన కుమ్మర సంఘం సమావేశంలో వారు మాట్లాడారు. కుమ్మర్లకు ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు వర్తింపజేయాలని జీవనోపాధికోసం బ్యాంకుల ద్వారా రుణాలు ఇప్పించాలని కోరారు. అనంతరం సంఘం నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా తేరాల బాలశంకర్, ఉపాధ్యక్షుడిగా పేరాల సోములు, ప్రధాన కార్యదర్శిగా పేరాల శంకర్, కోశాధికారిగా పేరాల సిద్దులు ఎన్నికయ్యారు.

దివ్యాంగుల సమస్యలను పరిష్కరించాలి

భూదాన్‌పోచంపల్లి, సెప్టెంబరు 22 (ఆంధ్రజ్యోతి) : మండల పరిధిలోని జూలూరు గ్రామపంచాయతీ కార్యాలయం వద్ద ఎమ్మార్పీఎస్, వీహెచ్‌పీఎస్ ఆధ్వర్యంలో సమస్యలపై ధర్నా నిర్వహించారు. కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ మండల అధ్యక్షుడు పాముకుంట్ల బసవయ్య, వీహెచ్‌పీఎస్ మండల ఇన్‌చార్జి మల్యాల మధు, నాయకులు ముత్తాపురం రాములు, యాకరి నర్సింగ్‌రావు, కోతులారం యాదగిరి, సాయికృష్ణ ఉన్నారు.

ఉదయం ఎండ.. సాయంత్రం వాన



భువనగిరిలో కురుస్తున్న వర్షం

భువనగిరి టౌన్/ రాజాపేట, సెప్టెంబరు 22 (ఆంధ్రజ్యోతి): భువనగిరిలో ప్రతి రోజు వర్షం కురుస్తూనే ఉన్నది. పగలంతా వాతావరణం సాధారణంగా ఉంటూ సాయంత్రం కాగానే వర్షం కురుస్తోంది. కొన్ని రోజులుగా ఇదే తీరు.. ఈ మేరకు సాయంత్రం రోజు మాదిరిగానే నేనున్నానంటూ వర్షం కురిసింది. దీంతో దేవి నవరాత్రి, బతుకమ్మ వేడుకలకు, పౌర జీవనానికి అటంకం కలిగింది.



రాజాపేటలో వీధిలో పారుతున్న వరద

రాజాపేట మండల కేంద్రంలో సోమవారం సాయంత్రం భారీ వర్షం కురిసింది. గంటపాటు కురిసిన వర్షానికి రాజాపేట, బొందుగుల దారిలో రోడ్డుకు అడ్డంగా చెట్లు కూలడంతో గ్రామ యువకులు తొలగించారు. గ్రామంలోని 5వ వార్డులో వరదతో లోతట్టు ప్రాంతాల లోని ఇళ్ల లోనికి నీరు చేరింది. దీంతో ప్రజలు కొంత ఇబ్బందికి గురయ్యారు

రిజర్వేషన్లపై చక చకా ఏర్పాట్లు

(5వ పేజీ తరువాయి)

మమేకమవుతున్నారు. ఉదయం నుంచి పల్లెల్లో పర్యటిస్తున్నారు.

ఎన్నికల ప్రక్రియను వేగవంతం చేసిన కమిషన్

రాష్ట్ర ఎన్నికల సంఘం ఎన్నికల ప్రక్రియను వేగవంతం చేసింది. ప్రభుత్వం నుంచి అందిన సంకేతాలతో గ్రామపంచాయతీ ఎన్నికలకోసం ఓటర్ల తుది జాబితాను సిద్ధంచేసింది. గ్రామీణప్రాంతాల్లోని అసెంబ్లీ నియోజకవర్గాల వారీగా ఓటర్ల జాబితాను అధికారులు సిద్ధం చేశారు. జిల్లా వ్యాప్తంగా 427 గ్రామపంచాయతీల పరిధిలో 3,704 వార్డులు ఉన్నాయి. జిల్లాలో ఎన్నికల నిర్వహణకు 2,251 బ్యాలెట్ బాక్సులకు ప్రస్తుతం 1,650 వరకు ఉన్నాయి. అదనంగా 601 వరకు బ్యాలెట్ బాక్స్‌లు గుజరాత్ నుంచి తెప్పించారు. జడ్పీటీసీ 17, ఎంపీటీసీ 178, ఎంపీటీసీల పోలింగ్‌స్టేషన్లు 995, పోలింగ్ లోకేషన్లు 461 ఉన్నాయి. మొత్తం 1,650 బ్యాలెట్ బ్యాక్సులకు అదనంగా మరో 284 వరకు సమకూర్చేందుకు చర్యలు తీసుకుంటున్నారు. గ్రామపంచాయతీల ఓటర్ల విభజన వార్డులవారీగా పూర్తయింది. గ్రామ పంచాయతీ కార్యదర్శి లాగిన్‌లో గ్రామంలోని వార్డులను పరిగణనలోకి తీసుకుని ఓటర్లను విభజించారు. సాధ్యమైనంత వరకు వారు నివసిస్తున్న వార్డులో ఓటు ఉండేలా చూస్తున్నారు. ఒక్కో వార్డుకు 300 మంది ఓటర్లలోపు ఉండేలా విభజన ప్రక్రియ చేపట్టారు. ఎన్నికల నిర్వహణకు ఆర్వోలు, ఏఆర్వోలు, పీవోల నియమాక ప్రక్రియ పూర్తియింది. గ్రామ పంచాయతీ, జిల్లా పరిషత్, మండ ల పరిషత్ ఎన్నికలకు రెండు విడతల్లో మొత్తం 6,889 మంది సిబ్బందిని నియమించేందుకు చర్యలు తీసుకున్నారు. మొత్తం 5734 మందికి పోలింగ్ సిబ్బందికి అనదంగా 1,155 మందిని నియమించారు.

మండలం	గ్రామాలు	వార్డులు	మొత్తం ఓటర్లు
అడ్డగూడూరు	17	150	23,022
ఆలేరు	16	140	21,537
ఆత్మకూరు	23	192	25,533
పోచంపల్లి	21	192	27,497
భువనగిరి	34	294	39,654
బీబీనగర్	34	284	42,876
బొమ్మలరామారం	35	284	29,503
చౌటుప్పల్	26	236	38,501
గుండాల	20	182	26,069
మోటకొండూరు	20	170	21,103
మోత్కూరు	10	88	13,215
నారాయణపూర్	31	260	40,113
రాజపేట	23	206	30,236
రామన్నపేట	24	232	45,358
తుర్కపల్లి	33	266	27,977
వలిగొండ	37	330	52,431
యాదగిరిగుట్ట	23	198	27,615
మొత్తం	427	3704	5,32,240

మొత్తం 5,32,240మంది ఓటర్లు

స్థానిక ఎన్నికల్లో భాగంగా ఎన్నికల సంఘం ఓటర్ల తుది జాబితాను ప్రకటించింది. జిల్లాలో మొత్తం 5,32,240మంది ఓటర్లు ఉన్నారు. వీరిలో పురుషులు 2,67,577మంది, మహిళలు 2,67,6 61మంది, ఇతరులు ఇద్దరు ఓటర్లు ఉన్నారు.

ఎమ్మెల్యేపై అసత్య ఆరోపణలు మానుకోవాలి

వలిగొండ, సెప్టెంబరు 22 (ఆంధ్రజ్యోతి): కొందరు కా వాలని స్థానిక ఎమ్మెల్యేలపై అసత్య ఆరోపణలు చేయడం సరైందికాదని కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు పాశం సత్తిరెడ్డి మాజీ ఎంపీపీ నూతి రమేష్‌రాజు అన్నారు. సోమవారం మండల కేంద్రంలో ఎమ్మెల్యే గృహంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. వేసవిలో సంగెం గ్రామంలో పీఏసీఎస్ ఆధ్వర్యంలో సేకరించిన వరిధాన్యం కొనుగోలులో జరిగిన అవకతవకలపై అధికారులు విచారణ చేపట్టి సదరు బాధ్యులై కేసు నమోదు చేసి చర్యలు తీసుకున్నారని తెలిపారు. ఆ గ్రామానికి చెందిన కొందరు వ్యక్తులు రైస్‌మిల్ యాజమానికిపై చర్యలు ఎందుకు తీసుకోలేదని, సదరు యజమానికి స్థానిక ఎమ్మెల్యే అనిల్‌కుమార్‌రెడ్డి, అండదండాలు ఉన్నాయని ఆరోపించడాన్ని వారు తీవ్రంగా ఖండించారు.

గీత కార్మికులను ప్రభుత్వం ఆదుకోవాలి



సమావేశంలో మాట్లాడుతున్న జయరాములు

రాజాపేట, సెప్టెంబరు 22 (ఆంధ్రజ్యోతి): గీత వృత్తిపై ఆధారపడి జీవిస్తున్న కల్లుగీత కార్మికులను ప్రభుత్వం ఆదుకోవాలని కల్లు గీత కార్మిక సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు బొలగాని జయరాములు డిమాండ్ చేశారు. సోమవారం రాజాపేట మండల కేంద్రంలో కల్లు గీత కార్మిక సంఘం 6వ మండల మహాసభ పాండవుల లక్ష్మణ్‌గౌడ్ అధ్యక్షతన జరిగింది. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ గీత కార్మికులకు వైన్స్ దుకాణాలలో 25 శాతం రిజర్వేషన్ కల్పించాలని, పెండింగ్‌లో ఉన్న ఎక్స్‌గ్రేషియాను బాధితులకు చెల్లించాలని ప్రభుత్వాన్ని కోరారు. కార్యక్రమంలో నాయకులు మహేందర్‌గౌడ్, గోపగాని యాదగిరిగౌడ్, దూపటి వెంకటేశ్,గోపగాని బాలమణి, బత్తిని సత్యనారాయణ,చిల్వేరు బాలరాజ్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

సుబ్బూరు మల్లయ్యకు మాజీ ఎమ్మెల్యే పరామర్శ



బాధిత కుటుంబ సభ్యులతో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే శేఖర్‌రెడ్డి

భువనగిరి రూరల్, సెప్టెంబరు 22(ఆంధ్రజ్యోతి): మాజీ జడ్పీటీసీ సభ్యులు సుబ్బూ రు బీరు మల్లయ్య సోదరుడి భార్య లక్ష్మి అకస్మాతుగా మృతి చెందింది. విషయం తెలుసుకున్న మాజీ ఎమ్మెల్యే పైళ్ల శేఖర్ రెడ్డి, బీఆర్ఎస్ పార్లమెంట్ ఇంచార్జి క్యామ మల్లేశ్ సోమవారం మండలంలోని రామకిష్టాపురం గ్రామంలో సుబ్బూరు లక్ష్మి మృత దేహంపె పుష్పగుచ్చం ఉంచి నివాళులర్పించారు. వారి వెంట బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు జనగాం పాండు, సుబ్బూరు రమేశ్, వెంకట్ రెడ్డి, కొండల్ రెడ్డి, బాల్ద రవి ఉన్నారు.

మునిపంపుల పీహెచ్‌సీలో శిబిరం

రామన్నపేట, సెప్టెంబరు 22 (ఆంధ్రజ్యోతి): జాతీయ ప్రోగ్రాంలో భాగంగా సోమవారం మండలంలోని మునిపంపుల పీహెచ్‌సీలో ప్రభుత్వ వైద్యులచే మెడికల్ క్యాంపు నిర్వహించారు. ఇందులో భాగంగా వచ్చిన పేషెంట్లకు బీపీ, షుగర్, రక్త, మూత్ర పరీక్షలు సాధారణ జబ్బులకు చికిత్సలు చిన్న పిల్లలకు పరీక్షలు నిర్వహించి తగు వైద్యం అందించారు. ఈ శిబిరంలో మొత్తం 232 మందికి వైద్య పరీక్షలు చేశారు. ఈ మెడికల్ క్యాంపులో గైనకాలజిస్టు డాక్టర్ అలివేలు, డాక్టర్ నవీన్, డాక్టర్ పి. శ్రీనివాస్, మెడికల్ ఆఫీసర్ డాక్టర్ అశ్వినికుమార్, డాక్టర్ సుమన్‌కళ్యాణ్ పాల్గొన్నారు.

విద్యార్థుల ప్రవర్తనను తల్లిదండ్రులు గమనించాలి



సమావేశంలో మాట్లాడుతున్న ప్రిన్సిపాల్ జగదీష్

రామన్నపేట, సెప్టెంబరు 22 (ఆంధ్రజ్యోతి): విద్యార్థుల ప్రవర్తనను తల్లిదండ్రులు గమనించాలని రామన్నపేట ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ చంద్రముఖి జగదీష్ సూచించారు. సోమవారం స్థానిక కళాశాలలో విద్యార్థుల తల్లిదండ్రులతో అధ్యాపకులు సమావేశం నిర్వహించారు. సమావేశంలో కళాశాల ప్రిన్సిపాల్ మాట్లాడుతూ విద్యార్థులు ఇంటి దగ్గర ఎలా చదువుతున్నారో లేదో గమనించాలన్నారు. తల్లిదండ్రులకు విద్యార్థుల ప్రవర్తన మీద, చదువు మీద జాగ్రత్తగా ఉండేలా కొన్ని సూచనలు చేశారు.

వయోవృద్ధులకు ప్రత్యేక కార్పొరేషన్ ఏర్పాటు చేయాలి

రామన్నపేట, సెప్టెంబరు 22 (ఆంధ్రజ్యోతి): దివ్యాంగులు, ట్రాన్స్‌జెండర్స్ శాఖ నుంచి వయోవృద్ధులను వేరుచేసి వయోవృద్ధులకు ప్రత్యేక కార్పొరేషన్ ఏర్పాటు చేయాలని టస్కా అసోసియేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రాపోలు నర్సయ్య, రాష్ట్ర నాయకులు ఏళ్ల బుచ్చిరెడ్డి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సోమవారం మండలంలోని సిరిపురం గ్రామంలో వయోవృద్ధుల అవగాహన సదస్సు నిర్వహించారు. 2007 చట్టాన్ని పూర్తిస్థాయిలో అమలు చేసి 2019 సవరణ చట్టాన్ని ఆమోదించాలని కోరారు. కార్యక్రమంలో ఎబిఆర్ ఛైర్మన్ ఏళ్ళ నాగమణి, అసోసియేషన్ నాయకులు కూనూరు సుదర్శన్, దంతూరి సత్తయ్య, బందారపు అంజయ్య, పూర్ణచందర్‌రాజు, వెంకటేశం, జెల్ల శ్రీరాములు, మిర్యాల బాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

డ్రైవర్స్, వర్కర్స్ యూనియన్ రాష్ట్ర కమిటీ సభ్యుడిగా సురేందర్



రామన్నపేట, సెప్టెంబరు 22 (ఆంధ్రజ్యోతి): రోడ్ ట్రాన్స్ పోర్టు డ్రైవర్స్, వర్కర్స్ యూనియన్ (సీఐటీయూ) రాష్ట్ర కమిటీ సభ్యుడిగా రామన్నపేట మండలంలోని మునిపంపుల (తుమ్మలగూడెం) గ్రామానికి చెందిన అప్పం సురేందర్ ఎన్నికయ్యారు. ఈనెల 21వ తేదీన హైదరాబాద్ సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో జరిగిన రో యూనియన్ నాలుగో రాష్ట్ర మహాసభలో సురేందర్ ఎన్నికయ్యారు. సురేందర్‌కు సీఐటీయూ మండల నాయకులు గొరిగే సోములు, బొడ్డుపల్లి వెంకటేశం అభినందనలు తెలిపారు.

కమ్యూనిస్టులు బలోపేతం కావాలి

బొమ్మలరామారం, సెప్టెంబరు 22 (ఆంధ్రజ్యోతి) : రానున్న స్థానిక ఎన్నికల్లో కమ్యూనిస్టులు బలోపేతం కావాలని సీపీఎం మండల కార్యదర్శి ర్యాకల శ్రీశైలం అన్నారు. సోమవారం మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడుతూ ప్రజల కోసం అనునిత్యం పోరాటం చేసేది కమ్యూనిస్టులేనని అన్నారు. చట్ట సభల్లో కమ్యూనిస్టులు లేక పేదల పక్షాన ప్రశ్నించే గొంతులు కరువయ్యాయని అన్నారు. సమావేశంలో పార్టీ గ్రామశాఖ కార్యదర్శి ఏలూరి నరసింహ, పోశయ్య, రమేష్, లక్ష్మీ, రవీందర్, రవి తదితరులు పాల్గొన్నారు.

ఆధ్యాత్మిక కోలాహలం



భువనగిరిలో దుర్గాదేవి పూజలో పాల్గొన్న బీజేపీ రాష్ట్ర నేత రామచందర్‌రావు

(ఆంధ్రజ్యోతి-న్యూస్‌నెట్‌వర్క్): దేవీ నవరాత్రి ఉత్సవాలు జిల్లాలో సోమవారం ఘనంగా ప్రారంభమయ్యాయి. జిల్లా వ్యాప్తంగా సుమారుగా 300 పైగా అమ్మవారి విగ్రహాలను ప్రతిష్ఠించారు. మండపాలను శోభాయమానంగా అలంకరించారు. జిల్లా కేంద్రం భువనగిరి పట్టణంలో తొలి పూజలను భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. తొలిరోజున బాలాత్రిపురసుందరిదేవి అలంకరణలో అమ్మవారు దర్శనమిచ్చారు. బీజేపీ రాష్ట్ర అధ్యక్ష కార్యదర్శులు ఎన్.రామచందర్‌రావు, వేముల అశోక్ తదితర ప్రముఖులు తొలి పూజలలో పాల్గొన్నారు. బతుకమ్మ వేడుకలు రెండవరోజున ఉత్సాహంగా నిర్వహించారు. అయితే సాయంత్రం అకస్మాత్తుగా కురిసిన వర్షంతో నవరాత్రి, బతుకమ్మ వేడుకలను అంతరాయం కలిగింది.

● యాదగిరిగుట్ట పట్టణ పరిధిలోని కొత్తగుండ్లపల్లి గ్రామంలో దేవీనవరాత్రులు ఉత్సాహంగా నిర్వహించారు. కార్యక్రమంలో బీర్ల ఫౌండేషన్ ఛైర్మన్ బీర్ల అనితఅయిలయ్య, 8వ వార్డు మున్సిపల్ మాజీ కౌన్సిలర్ ముక్కెర్ల మల్లేశ్‌యాదవ్, ఆశ వర్కర్ ముక్కెర్ల వెంకటమ్మ, తదితరులు పాల్గొన్నారు.



కొత్తగుండ్లపల్లి గ్రామంలో పూజలో పాల్గొన్న ప్రభుత్వ విప్ కుటుంబ సభ్యులు

● బొమ్మలరామారంలో భువనగిరి మార్కెట్ వైస్ ఛైర్మన్ రాజేష్ పైలెట్, దేవాలయ కమిటీ ఛైర్మన్ పండుగ రాజు, ఉత్సవ కమిటీ నిర్వాహకులు కట్ట శ్రీకాంత్, సాదుల ప్రవీణ్ పాల్గొన్నారు.

● వలిగొండ మండలంలోని త్రిశక్తి ఆలయంలో మహాకాళి, మహాలక్ష్మి, మహాసరస్వతి అమ్మవార్లకు ప్రత్యేక అభిషేకాలు నిర్వహించారు. అమ్మవారు బాలా త్రిపుర సుందరీదేవి అలంకరణలో భక్తులకు దర్శనం ఇచ్చారు. నిర్వాహకులు పాల్గొన్నారు.



భూదాన్‌పోచంపల్లి: పూజలో పాల్గొన్న లక్ష్మీనారాయణ కుటుంబ సభ్యులు

● బీబీనగర్ మండలంలో అన్నప్రసాద వితరణ కార్యక్రమాలు ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో బొర్ర రమేశ్, పంజాల శ్రీనివాస్ గౌడ్, టంటం భార్గవ్, శ్రీకాంత్, ఆకుల సాయికుమార్ పాల్గొన్నారు.

● ఆత్మకూరు(ఎం) మండల కేంద్రంతోపాటు పలు గ్రామాల్లో బాల త్రిపుర సుందరీ దేవిగా అలంకరించారు.

● చౌటుప్పల్‌లోని సీతారామచంద్రస్వామి దేవాలయంలో ప్రధాన అర్చకుడు పెద్ది సుధాకర్ శర్మ, పెద్ది కిషోర్ శర్మ, ఆలయ ఛైర్మన్ బి.మురళి, మునిసిపల్ మాజీ ఛైర్మన్ వెన్‌రెడ్డి రాజు- సంధ్య దంపతులు, దేవాలయ ధర్మకర్తలు గుర్రం వెంకటేశం, వర్కాల వెన్నెల, టి. నర్సింహ్మా, ముత్యాల భూపాల్ రెడ్డి, ఎం. సత్యనారాయణ, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు బాల్యం వెంకటాచలపతి, న్యాయవాతులు ఊడుగు శ్రీనివాస్ ,జక్కర్తి శేఖర్, పోలోజు శ్రీలత పాల్గొన్నారు. దండుమల్కాపురం, కొయ్యలగూడెం, పంతంగి, నేలపట్లలోని గ్రామాల్లో ఉత్సవాలు ఘనంగా ప్రారంభమయ్యాయి.

● గుండాల మండలంలో శ్రవణ్‌కుమార్ రెడ్డి, శివారెడ్డి, రాజిరెడ్డి, చిందం ప్రకాశ్, వేణుగోపాల్ రెడ్డి, శ్రీకాంత్, వెంకన్న పాల్గొన్నారు.

● మోత్కూరులో ఉదయం నుంచి సాయంత్రం వరకు పలు చోట్ల దుర్గాదేవి విగ్రహాలను ప్రతిష్ఠించి పూజలు చేస్తూనే ఉన్నారు.

● భూదాన్‌పోచంపల్లి ఓల్డ్ సిటీ దుర్గా కమిటీ ఆధ్వర్యంలోని మండపంలో అమ్మవారి విగ్రహదాత సోమవరపు లతా లక్ష్మీనారాయణ, సోమవరపు కవిత నిఖిల్, సుగుణమ్మ కుటుంబ సభ్యులు తొనుకునూరి ప్రణవి సాయికుమార్, ట్రినిటీ, బెల్దె జయలక్ష్మీసోమయ్య, దుర్గా కమిటీ అధ్యక్షుడు అంకం సాయి, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.



చౌటుప్పల్‌లో పూజలో పాల్గొన్న మునిసిపల్ మాజీ ఛైర్మన్ రాజు దంపతులు